



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



# ఎనర్జీ మ్యాప్‌లో.. ఏపీకి కొత్త షేప్

## సోలార్.. విండ్.. హైబ్రిడ్.. పంప్డ్ స్టోరేజ్.. గ్రీన్ హైడ్రోజన్

- విద్యుదుత్పత్తి నుంచి ఎనర్జీ ఎకానమీవైపు అడుగులు
- 24/7 పవర్ కోసం స్టోరేజ్‌పై ప్రత్యేక దృష్టి
- రూ.5,176 కోట్లకు పైగా కొత్త ప్రాజెక్టులు..
- డేటా సెంటర్లు, గ్రీన్ పరిశ్రమలు, క్లీన్ ఎనర్జీకి కొత్త అవకాశాలు

**ఒ**కప్పుడు విద్యుత్ అంటే థర్మల్ పవర్ ప్లాంట్లు, హైడల్ ప్రాజెక్టులు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్లు మాత్రమే. విద్యుదుత్పత్తి ఎంత? డిమాండ్ ఎంత? లోటు ఎంత? అదనపు విద్యుత్‌ను ఎక్కడినుంచి కొనాలి? ఇవే ప్రధాన ప్రశ్నలు. అలాంటి విద్యుత్ రంగం నిర్వచనాన్ని ఏపీ సర్కారు మారుస్తోందా? సూర్యుడి నుంచి విద్యుత్.. గాలిలోని శక్తిని విద్యుత్‌గా మార్చడం.. రెండింటినీ కలిపిన హైబ్రిడ్ ప్రాజెక్టులు.. అవసరమైనప్పుడు విద్యుత్‌ను విడుదల చేసే పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్.. భవిష్యత్ పరిశ్రమలకు ఇంధనంగా మారనున్న గ్రీన్ హైడ్రోజన్.. ఈ మొత్తం వ్యవస్థను ఒకే ఎనర్జీ ఎకానమీగా మలిచే కొత్త దిశలోకి అడుగు పెడుతుందా? అంటే.. పెట్టిందనే చెప్పాలి.

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఇదే మార్గంలో ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తోంది. తాజాగా రాష్ట్ర కేబినెట్ రూ.5,176.56 కోట్ల విలువైన ఇంధన రంగ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిలో శ్రీ సత్యసాయి జిల్లాలో 675 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుతో పాటు వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో సోలార్-విండ్ హైబ్రిడ్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,240 ఉద్యోగాల సృష్టి అవకాశాన్ని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఈ నిర్ణయాన్ని కేవలం మరికొన్ని సోలార్ ప్రాజెక్టులకు అనుమతిచ్చిన చర్యగా చూడటం కంటే.. రాష్ట్ర ఎనర్జీ మ్యాప్‌లో చోటుచేసుకుంటున్న విస్తృత మార్పులో మరో అడుగుగా చూడాల్సిన తరుణమిది.

(మిగతా 2వ పేజీలో)




2030నాటికి ఏపీలో 72.60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి మా లక్ష్యం. గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో అత్యుత్తమ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. సుదీర్ఘ తీరప్రాంతం, బలమైన పారిశ్రామిక మౌలిక వసతులు, అద్భుతమైన రవాణా అనుసంధానం, విస్తారమైన సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ అవకాశాలు ఏపీకి ఉన్నాయి. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పన్ను రాయితీలు, సబ్సిడీలు, సరళమైన నిబంధనలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచ పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నాం. పునరుత్పాదక ఇంధన రంగం ద్వారా ఉద్యోగాలు కల్పించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసి, గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం.

**-సీఎం చంద్రబాబు నాయుడు**



ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యాన్ని పెంచడం మా లక్ష్యం కాదు. సోలార్, విండ్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాలతో పాటు తయారీ, నైపుణ్యాభివృద్ధి, సప్లై చైన్లను అనుసంధానించి పూర్తి స్థాయి క్లీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నాం. పునరుత్పాదక విద్యుత్‌ను పరిశ్రమలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్ ఫ్యూయల్స్, ఎగుమతులతో అనుసంధానించి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దుతాం.

**-నారా లోకేష్**

---

## పర్యాటకాంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యం

- జీడీపీలో అత్యధిక వాటా సాధించడమే లక్ష్యం
- ఏపీని చూస్తే దేశం అంతటినీ చూసినట్టే
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- రాజమండ్రిలో అంగరంగ వైభవంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

6





4

## లోకేష్ చేతుల మీదుగా నేడు ‘పట్టా’భిషేకం

- మరో 372కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీ
- నేడు కుంచనపల్లిలో మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమం

## బీసీ బాంధవుడు.. చంద్రన్నే

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్
- జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు రిజర్వేషన్లలో ద్రోహం
- బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు
- గృహ నిర్మాణ మంత్రి కొలుసు




5



## కూటమి సమన్వయమే విజయానికి కీలకం

- అనుకూలమైన అభ్యర్థులను గుర్తించాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

5

## పల్లె పండుగ 3.0 సక్సెస్ చేయాలి

- మంత్రి ఆనం పిలుపు
- ఆత్మకూరులో కూటమి నేతలతో సమావేశం
- రామాపురంలో సీఎం సభకు భారీ జనసమీకరణ

5



## పోర్టునుంచి ప్రొడక్షన్‌కి..

- రూ.8వేల కోట్లతో గోవా షిప్‌యార్డ్ ప్రాజెక్టు
- నౌకల తయారీ, మరమ్మతులకు కేంద్రంగా బందరు
- 8,000 ఉద్యోగాల కల్పనకు అవకాశం

4



# ఎనర్జీ మ్యాప్‌లో.. ఏపీకి కొత్త షేప్!



- సోలార్.. విండ్.. హైబ్రిడ్.. పంప్డ్ స్టోరేజ్.. గ్రీన్ హైడ్రోజన్
- విద్యుదుత్పత్తి నుంచి ఎనర్జీ ఎకానమీవైపు అడుగులు
- రూ.5,176 కోట్లకు పైగా కొత్త ప్రాజెక్టులు..
- 24/7 పవర్ కోసం స్టోరేజ్‌పై ప్రత్యేక ప్రణాళికలు
- డేటా సెంటర్లు, గ్రీన్ పరిశ్రమలు, క్లీన్ ఎనర్జీ తయారీకి కొత్త అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీకి పునరుత్పాదక విద్యుత్ రంగం కొత్తేమీ కాదు. రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతాలు సౌర, పవన విద్యుత్‌కు అనుకూలంగా ఉన్నాయి. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, సత్యసాయి జిల్లాలు ఇప్పటికే రెన్యూవబుల్ ఎనర్జీ పెట్టుబడులకు కేంద్రాలుగా మారుతున్నాయి. మరోవైపు తీర ప్రాంతానికి చెందిన జిల్లాలు భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, పోర్టు ఆధారిత క్లీన్ ఎనర్జీ పరిశ్రమలకు అవకాశాలు కల్పించగలిగేవిగా ఉన్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం 2024లో తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా సోలార్, విండ్, విండ్-సోలార్ హైబ్రిడ్, చిన్న జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, ఈవీ చార్జింగ్‌వంటి రంగాలను ఒకే క్లీన్ ఎనర్జీ ఫ్రేమ్‌వర్క్‌లోకి తీసుకొచ్చింది. ఈ విధానం లక్ష్యం కేవలం విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే కాదు, రాష్ట్రంలో పెద్దఎత్తున రెన్యూవబుల్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక ఉద్యోగాలను సృష్టించడం, క్లీన్ ఎనర్జీ పరికరాల తయారీకి ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి-ఎగుమతులకు రాష్ట్రాన్ని సిద్ధం చేయడంవంటి అంశాలను విధాన లక్ష్యాలుగా పేర్కొంది. దీర్ఘకాలికంగా సుమారు 160 గిగావాట్ల అదనపు రెన్యూవబుల్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసే లక్ష్యాన్ని కూడా పాలసీ ప్రస్తావించింది. అంటే.. ఎనర్జీ పాలసీని ఇకపై విద్యుత్ శాఖకు మాత్రమే పరిమితం చేయకుండా పరిశ్రమలు, పెట్టుబడులు, తయారీ, రవాణా, డిజిటల్ రంగం, ఎగుమతులతో అనుసంధానించే ప్రయత్నానికి పురిపెట్టింది.

## 24/7 పవర్.. అసలు కీలకం ఇదే

రెన్యూవబుల్ ఎనర్జీ పెరగడం ఒక విషయం. రోజులో ప్రతి గంటా నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండటం మరో విషయం. సూర్యుడు ఉన్నప్పుడు సోలార్ విద్యుత్ ఎక్కువగా వస్తుంది. గాలి వేగం ఉన్నప్పుడు విండ్ పవర్ ఉత్పత్తి పెరుగుతుంది. కానీ విద్యుత్ అవసరం మాత్రం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి నిరంతరం ఉంటుంది. ఈ అంతరాన్ని పూడ్చకపోతే పెద్ద పరిశ్రమలు, డేటా సెంటర్లు, అత్యాధునిక తయారీ యూనిట్లు పూర్తిగా రెన్యూవబుల్ ఎనర్జీపై ఆధారపడటం కష్టం. ఇక్కడే ఎనర్జీ స్టోరేజ్ ప్రాధాన్యం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూపొందించిన రోడ్‌మ్యాప్‌లో 1,600 మెగావాట్ల కొత్త థర్మల్ పవర్‌తోపాటు 2,000 మెగావాట్లకు పైగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులను విస్తరించడంపై దృష్టి పెట్టింది. నిజానికి -ఇది కీలక మార్పు. భవిష్యత్ విద్యుత్ వ్యవస్థలో "ఎంత విద్యుదుత్పత్తి చేస్తున్నాం?" అన్న ప్రశ్నతో పాటు "అవసరమైనప్పుడు ఎంత విద్యుత్‌ను వెంటనే అందించగలం?" అన్న ప్రశ్న కూడా ముఖ్యమవుతుందన్న ముందుచూపు. సోలార్ పవర్‌ను పగటిపూట ఉత్పత్తి చేసి నిల్వ చేసి రాత్రి వినియోగించడం.. గాలి విద్యుత్ అధికంగా ఉన్న సమయంలో నిల్వ చేయడం.. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్‌ను గ్రిడ్‌లోకి పంపించడం.. ఈ వ్యవస్థే భవిష్యత్ పవర్ గ్రిడ్‌కు కీలకం.

## పంప్డ్ స్టోరేజ్.. నీటితో తయారయ్యే 'బ్యాటరీ'

పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను సులభంగా చెప్పాలంటే.. భారీస్థాయి 'వాటర్ బ్యాటరీ'గా చూడవచ్చు. విద్యుత్ అందుబాటులో ఎక్కువగా ఉన్న సమయంలో నీటిని దిగువ జలాశయంనుంచి ఎగువ జలాశయానికి పంపిస్తారు. విద్యుత్ అవసరం పెరిగినప్పుడు ఆ నీటిని కిందకు వదిలి టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తారు. సోలార్, విండ్‌వంటి మారుతున్న ఉత్పత్తి స్వభావం కలిగిన విద్యుత్ వనరులకు ఇది ముఖ్యమైన బ్యాలెన్సింగ్ వ్యవస్థ. ఆంధ్రప్రదేశ్ పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని భారీగా వినియోగించుకోవాలని ఇప్పటికే ప్రత్యేక విధానం తీసుకొచ్చింది. కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ నమోదు చేసిన రాష్ట్ర విధానాల ప్రకారం, ఏపీ పంప్డ్ స్టోరేజ్ పాలసీ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సుమారు 33 గిగావాట్ల పీఎస్పీ సామర్థ్యాన్ని వినియోగించుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది కేవలం పవర్ ప్రాజెక్టుల పరంగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరంగానూ కీలక అవకాశం. భారీ స్టోరేజ్ ప్రాజెక్టులు వస్తే నిర్మాణరంగంలో పెట్టుబడులు, స్థానిక సేవలు, ఇంజినీరింగ్, నిర్వహణ, పరికరాల సరఫరా వంటి అనేక రంగాలకు డిమాండ్ ఏర్పడుతుంది.

## కర్నూలునుంచి కనిపిస్తున్న భవిష్యత్ మోడల్

కర్నూలు ప్రాంతంలో ఇప్పటికే ఏర్పడుతున్న భారీ ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ మోడల్ ఈ మార్పునకు ఒక ఉదాహరణ. పిన్నాపురం వద్ద 'గ్రీన్‌కో' అభివృద్ధి చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులో 4,000 మెగావాట్ల సోలార్, 1,000 మెగావాట్ల విండ్, 1,680 మెగావాట్ల పంప్డ్ హైడ్రో పవర్ ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టుకు రోజుకు ఒక సైకిల్‌లో 10,080 మెగావాట్ అవర్ స్టోరేజ్ సామర్థ్యముంది. గ్రీన్ స్టీల్, గ్రీన్ అల్యూమినియం, గ్రీన్ హైడ్రోజన్‌వంటి పరిశ్రమలకు డిస్పాచబుల్ క్లీన్ పవర్ అందించడమే దీని లక్ష్యాల్లో ఒకటి. ఇలాంటి ప్రాజెక్టులు ఒక కొత్త ఆలోచనను ముందుకు తెస్తున్నాయి. అంటే, విద్యుదుత్పత్తి చేసే రాష్ట్రం మాత్రమే కాదు.. ఆ విద్యుత్‌ను నిల్వ చేసి, అవసరమైనప్పుడు అందించి, దానిని ఆధారంగా చేసుకుని కొత్త పరిశ్రమలను ఆకర్షించే రాష్ట్రంగా ఏపీ అవతరించబోతోంది. ఇదే ఎనర్జీ ఎకానమీ!

## సోలార్-విండ్ హైబ్రిడ్ ఎందుకు?

ఒక ప్రాంతంలో కేవలం సోలార్ ప్రాజెక్టు ఉంటే రాత్రిపూట ఉత్పత్తి ఉండదు. కేవలం విండ్ ప్రాజెక్టు ఉంటే గాలి వేగంపై ఆధారపడాల్సి ఉంటుంది. రెండింటినీ కలిపిన హైబ్రిడ్ మోడల్‌లో ఉత్పత్తి ప్రొఫైల్‌ను కొంత సమతుల్యం చేయవచ్చు. ఇదే కారణంగా ఏపీలో సోలార్-విండ్ హైబ్రిడ్ ప్రాజెక్టులపై దృష్టి పెరుగుతోంది. మొన్నటి జూలైలో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ 800 మెగావాట్ల ప్రాజెక్టుకు కర్నూలు-అనంతపురం ప్రాంతంలో గ్రౌండ్‌బ్రేకింగ్ చేసింది. ఇందులో 400 మెగావాట్ల విండ్, 400 మెగావాట్ల సోలార్ సామర్థ్యముంది. కంపెనీ చెప్తోన్న దాని ప్రకారం, ప్రాజెక్టుకు రూ.5,750 కోట్ల పెట్టుబడి ఉండగా, సుమారు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ప్రాజెక్టుకు 800 మెగావాట్ల ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ కనెక్టివిటీ కూడా ఉంది. ఇది మరో ముఖ్య విషయాన్నీ చూపిస్తోంది. రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టు పెట్టడం మాత్రమే సరిపోదు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను జాతీయ లేదా రాష్ట్ర గ్రిడ్‌కు సమర్థంగా తరలించేందుకు ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాలు కూడా అదే వేగంతో అభివృద్ధి చెందాలి.

## ట్రాన్స్‌మిషన్.. కీలకమైన మౌలిక సదుపాయం

ఒక ప్రాంతంలో వేల మెగావాట్ల సోలార్, విండ్ విద్యుదుత్పత్తి చేయవచ్చు. కానీ ఆ విద్యుత్‌ను వినియోగ కేంద్రాలకు తీసుకెళ్లే ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ లేకపోతే పెట్టుబడుల ప్రయోజనం పూర్తిగా అందదు. అందుకే భవిష్యత్ ఎనర్జీ మ్యాప్‌లో మూడు లేయర్లను చూడాలి. మొదటిది -జెనరేషన్. సోలార్, విండ్, హైబ్రిడ్ ద్వారా విద్యుదుత్పత్తి. రెండోది -స్టోరేజ్. బ్యాటరీలు, పంప్డ్ స్టోరేజ్ ద్వారా అవసరమైన సమయానికి విద్యుత్ అందుబాటులో ఉంచడం. మూడోది -ట్రాన్స్‌మిషన్. ఆ విద్యుత్‌ను పరిశ్రమలు, నగరాలు, డేటా సెంటర్లు, వ్యవసాయ రంగ ప్రాంతాలకు తరలించడం. ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే క్లీన్ ఎనర్జీ పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థపై పెద్ద ప్రభావం చూపుతాయి.

ఇక్కడ ఏపీకి ఉన్న మరో బలం పోర్టులు. గ్రీన్ హైడ్రోజన్ లేదా గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసిన తర్వాత దేశీయ పరిశ్రమలకు సరఫరా చేయడంతోపాటు భవిష్యత్‌లో ఎగుమతులకు కూడా పోర్టులు కీలకం కావచ్చు. అంటే.. రాయలసీమలో రెన్యూవబుల్ విద్యుత్ ? స్టోరేజ్ ? గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ? తీర ప్రాంత పోర్టులు ? దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు అనే ఒక కొత్త ఎనర్జీ కారిడార్ ఆలోచన పదునుదేరుతోంది.

## విశాఖలో డేటా సెంటర్లు.. విద్యుత్‌కు కొత్త డిమాండ్

ఇక మరోవైపు ఏపీకి వస్తున్న డేటా సెంటర్ పెట్టుబడులు ఎనర్జీ రంగానికి కొత్త డిమాండ్‌ను సృష్టించే అవకాశముంది. డేటా సెంటర్లు 24 గంటలూ విద్యుత్ అవసరమయ్యే మౌలిక సదుపాయాలు. ఒక్కసారి డేటా సెంటర్ ఆపరేషన్స్ ప్రారంభమైతే నిరంతర విద్యుత్ సరఫరా, బ్యాకప్, కూలింగ్, నీటి లభ్యతవంటి అంశాలు అత్యంత కీలకం. ఇందుకే విశాఖపట్నాన్ని డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్న సమయంలో ఎనర్జీ పాలసీకి కూడా కొత్త ప్రాధాన్యం వచ్చింది. ఇటీవల రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఏపీలో డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌లో కనీసం 70 శాతం పునరుత్పాదక వనరులనుంచి రావాలనే నిబంధనను రాష్ట్రం అమలు చేయాలని నిర్ణయించింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ (తరువాయి 3లో..)



చైతన్యరథం



# ఎనర్జీ మ్యాప్‌లో.. ఏపీకి కొత్త షేప్!

*"ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే 'క్లీన్ ఎనర్జీకి సౌదీ అరేబియా'గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. సౌర, పవన విద్యుత్‌తో ఆగిపోకుండా పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మాలిక్యూల్స్ వరకు పూర్తి ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఏపీలో ఉత్పత్తి అయ్యే క్లీన్ ఫ్యూయల్స్, గ్రీన్ మాలిక్యూల్స్‌ను త్వరలోనే యూరప్, జపాన్, దక్షిణ కొరియావంటి ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లడమే మా లక్ష్యం. ఇంధన భద్రతతో పాటు పరిశ్రమలు, పెట్టుబడులు, నైపుణ్యాలు, ఉద్యోగాలను కలిపి ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ క్లీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దుతాం."*

**- మంత్రి నారా లోకేష్**

(2వ పేజీ తరువాయి.. )

ఆధారిత విద్యుత్ వనరులను దీనికి అనుసంధానించాలనే దిశను ప్రభుత్వం పేర్కొంది. డేటా సెంటర్ల నీటి అవసరాలను కూడా సమగ్రంగా పరిష్కరించే విధానంపై దృష్టి పెట్టింది.

నిజానికి –ఇది ఒక ఆసక్తికరమైన మార్పు. ఇప్పటివరకు "డేటా సెంటర్ కోసం పవర్ ఎక్కడినుంచి వస్తుంది?" అనే ప్రశ్న ఉండేది. ఇప్పుడు.. "డేటా సెంటర్‌కు క్లీన్‌పవర్ ఎక్కడి నుంచి వస్తుంది? దాన్ని ఎలా నిల్వ చేస్తాం? నీటి అవసరాన్ని ఎలా తీర్చాలి? కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను ఎలా తగ్గించాలి?" అనే ప్రశ్నలు కూడా ముందుకు వస్తున్నాయి.

## టొరెంట్‌వంటి పెట్టుబడిదారుల వైపు చూపు

ఇదే నేపథ్యంతో ఇటీవల ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేశ్ గుజరాత్‌లో టొరెంట్ గ్రూప్ ప్రతినిధులతో జరిపిన సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. సోలార్, విండ్, హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులతోపాటు పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ఏపీలో పెట్టుబడులను పరిశీలించాలని ఆయన సంస్థను ఆహ్వానించారు. టొరెంట్ గ్రూప్ 2030 నాటికి 10 గిగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుందని, ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సంస్థ ప్రతినిధులు మంత్రి లోకేష్‌కు హామీ ఇవ్వడం సానుకూల అంశం. ఇది పెట్టుబడి వచ్చేసిందని కాదు. కానీ రాష్ట్రం తన ఎనర్జీ వ్యూహాన్ని పరిశ్రమలతో అనుసంధానిస్తూ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోందనే విషయం స్పష్టమవుతోంది. ఇలాంటి చర్చలు మరింత ముందుకెళ్తే.. భవిష్యత్‌లో పవర్ జనరేషన్ ప్రాజెక్టులతోపాటు పరికరాల తయారీ, ఇంజినీరింగ్, ఆపరేషన్స్, మెయింటెనెన్స్, ఎనర్జీ సాఫ్ట్‌వేర్, స్టోరేజ్ టెక్నాలజీవంటి అనుబంధ రంగాల్లోనూ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది.

## ఎనర్జీ మ్యాప్‌లో జిల్లాల పాత్ర మారే అవకాశం

కొత్త ఎనర్జీ మ్యాప్‌లో ప్రతి ప్రాంతానికి ఒక ప్రత్యేక పాత్ర ఏర్పడే అవకాశముంది. కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలు –సోలార్, విండ్, హైబ్రిడ్, స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రధాన కేంద్రంగా ఎదగవచ్చు. వైఎస్సార్ కడప జిల్లా.. సోలార్–విండ్ హైబ్రిడ్‌తోపాటు భవిష్యత్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అవకాశం కల్పించొచ్చు. ప్రకాశం జిల్లా.. రెన్యూవబుల్ ఎనర్జీ పరికరాల తయారీకి అవకాశాలు పెరుగుతున్నాయి. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ఆధారంగా రిన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ఆధారంగా ప్లగ్ అండ్ ప్లే మోడల్‌లో అభివృద్ధి చేసే ప్రయత్నం జరుగుతోంది. విశాఖపట్నం జిల్లా.. డేటా సెంటర్లు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్లీన్ ఎనర్జీ ఆధారిత పరిశ్రమలకు డిమాండ్ కేంద్రంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇక కాకినాడ, కృష్ణపట్నం, రామాయపట్నం వంటి తీర ప్రాంతాలు –పోర్టుల ఆధారంగా గ్రీన్ అమోనియా, గ్రీన్ హైడ్రోజన్, ఎగుమతి ఆధారిత పరిశ్రమలకు అవకాశాలు పరిశీలించవచ్చు. ఇలా చూస్తే ఎనర్జీ రంగం ఒకే జిల్లాలోని పవర్ ప్లాంట్ సమస్యగా కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఒక పారిశ్రామిక భౌగోళికపటంగా మారుతున్న దృశ్యాలు ఏపీలో గోచరిస్తున్నాయి.

## తయారీ రంగం వస్తే పూర్తి ప్రయోజనం

రెన్యూవబుల్ ప్రాజెక్టులు రావడం ద్వారా పెట్టుబడులు వస్తాయి. కానీ దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ఎక్కువ విలువ రావాలంటే పరికరాల తయారీ కూడా పెరగాలి. సోలార్ మాడ్యూల్స్, ఇన్వర్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్స్, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ ప్యాక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, పంప్డ్ స్టోరేజ్ పరికరాలు, ఎలక్ట్రోలైజర్లు, గ్రీన్ హైడ్రోజన్ సంబంధిత పరికరాలు.. వీటి తయారీకి స్థానిక ఎకోసిస్టమ్ ఏర్పడితేనే రెన్యూవబుల్ ఎనర్జీ పెట్టుబడులు పెద్దస్థాయిలో ఉపాధి, చిన్న పరిశ్రమలు, సేవా రంగానికి ప్రయోజనం కలిగించగలవు. ఇదే అంశాన్ని ఐసీఈపీ (ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ) కూడా ప్రస్తావిస్తోంది. స్థానిక సోలార్, విండ్ తయారీ సదుపాయాలతోపాటు క్లీన్ ఎనర్జీ టెక్నాలజీల విలువ గొలుసును అభివృద్ధి చేయడం పాలసీ లక్ష్యాల్లో ఉంది. యువతకు క్లీన్ ఎనర్జీ రంగంలో నైపుణ్యాభివృద్ధి, పరిశోధనకు ప్రాధాన్యమివ్వాలని పాలసీ సూచిస్తోంది. అంటే భవిష్యత్‌లో ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో కూడా కొత్త కోర్సులకు డిమాండ్ రావచ్చు.

## ఉద్యోగాల స్వభావం మారుతుంది

ఎనర్జీ రంగంలో ఉద్యోగాలు అంటే ఇకపై పవర్ ప్లాంట్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకే పరిమితం కాదు. సోలార్ ప్రాజెక్టుల నిర్మాణం, సైట్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, డేటా అనలిటిక్స్, గ్రిడ్ మేనేజ్‌మెంట్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, పవర్ ట్రేడింగ్, స్టోరేజ్ ఆపరేషన్స్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఆపరేషన్స్, ఎలక్ట్రోలైజర్ మెయింటెనెన్స్, ఎనర్జీ ఆడిటింగ్ వంటి అనేక కొత్త ఉద్యోగ విభాగాలు ఏర్పడవచ్చు. ఇటీవల కేబినెట్ ఆమోదించిన రూ.5,176.56 కోట్ల ఎనర్జీ ప్రాజెక్టులకు సుమారు 2,240 ఉద్యోగాల ఉపాధి సామర్థ్యాన్ని అంచనా వేసింది. టాటా పవర్ 800 మెగావాట్ల ప్రాజెక్టుకు సుమారు 4,000 ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఉంటాయని సంస్థ వెల్లడించింది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రాజెక్టు ప్రకటించడం, ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించడం, వాణిజ్య కార్యకలాపాలు మొదలవడం.. ఈ మూడు వేర్వేరు దశలు. కాబట్టి ఉద్యోగాల సంఖ్యను తక్షణంగా ఏర్పడిన ఉద్యోగాలుగా కాకుండా ఆయా సంస్థలు లేదా ప్రభుత్వం పేర్కొన్న అంచనా ఉపాధి సామర్థ్యంగా చూడాలి.

## సేద్యంలోనూ ఎనర్జీ మార్పు ప్రభావం

క్లీన్ ఎనర్జీ చర్చ పరిశ్రమల దగ్గరే ఆగిపోదు. వ్యవసాయ రంగానికీ ఇది వర్తిస్తుంది. వ్యవసాయ ఫీడర్ల సోలరైజేషన్ ద్వారా పగటి సమయంలో వ్యవసాయ పంపులకు విద్యుత్ అందించడం, రైతుల విద్యుత్ అవసరాలను కొంత స్థిరీకరించడం, అదనపు సోలార్ విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడం వంటి నమూనాలు దేశవ్యాప్తంగా చర్చలో ఉన్నాయి. ఏపీకి కూడా వ్యవసాయ విద్యుత్ వినియోగం పెద్ద అంశమే. కాబట్టి సోలార్ ఆధారిత వ్యవసాయ ఫీడర్లు, పంపులు, డిస్ట్రిబ్యూటెడ్ సోలార్‌వంటి అంశాలు గ్రామీణ ఎనర్జీ వ్యవస్థలో భాగమయ్యే అవకాశం కనిపిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎనర్జీ రంగం కొత్త పెట్టుబడులకు రావొచ్చన్న అంచనాలున్నాయి.

## ఇళ్లపై సోలార్.. వికేంద్రీకృత విద్యుత్ వ్యవస్థ

పెద్ద ప్రాజెక్టులతోపాటు చిన్నస్థాయి సోలార్ వ్యవస్థలు కూడా భవిష్యత్ ఎనర్జీ మ్యాప్‌లో భాగమవుతున్నాయి. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం, రైతు పంపులను సోలరైజ్ చేయడం, పరిశ్రమల రూఫ్‌టాప్ సోలార్, ప్రభుత్వ భవనాల్లో సౌర విద్యుత్ వంటి విధానాలు విద్యుదుత్పత్తిని కేంద్రీకృత వ్యవస్థ నుంచి కొంత వికేంద్రీకరించగలవు. ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ ప్రస్తుతం రాష్ట్రంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలకు సంబంధించిన కార్యక్రమాలు, క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ వంటి చర్యలను ముందుకు తీసుకెళ్తోంది.



అంటే ఒకవైపు గిగావాట్ స్థాయి ప్రాజెక్టులు.. మరోవైపు కిలోవాట్ స్థాయి రూఫ్‌టాప్ సోలార్. ఈ రెండు కలిసినప్పుడే ఎనర్జీ ట్రాన్సిషన్ విస్తృత ప్రజా భాగస్వామ్యంతో ముందుకు సాగుతుంది. ఇటీవలి పరిణామాలను కలిపి చూస్తే ఏపీ ఎనర్జీ వ్యూహంలో ఒక కొత్త చైన్ కనిపిస్తోంది.

సూర్యుడు– సోలార్ పవర్, గాలి– విండ్ పవర్, సూర్యుడు ప్లస్ గాలి –హైబ్రిడ్ పవర్, అధిక విద్యుత్ –బ్యాటరీ/పంప్డ్ స్టోరేజ్, క్లీన్ పవర్ –గ్రీన్ హైడ్రోజన్, క్లీన్ పవర్ ప్లస్ నీరు ప్లస్ పోర్టులు –గ్రీన్ ఇండస్ట్రీస్, క్లీన్ పవర్ ప్లస్ డిజిటల్ మౌలిక సదుపాయాలు –డేటా సెంటర్లు, క్లీన్ ఎనర్జీ ప్లస్ తయారీ –కొత్త పారిశ్రామిక ఎకోసిస్టమ్.. ఇవన్నీ కలిస్తే –పెట్టుబడులు ప్లస్ ఉపాధి ప్లస్ ఎగుమతులు. ఇదే అసలు ఎనర్జీ మ్యాప్ మార్పు.

## 2030 దిశగా.. ఏపీకి కొత్త అవకాశం

కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 2026 ఆగస్టు 31 నాటికి దేశంలో మొత్తం రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యం 295.55 గిగావాట్లకు చేరింది. ఇందులో 168.04 గిగావాట్ల సోలార్, 58.52 గిగావాట్ల విండ్ సామర్థ్యం ఉన్నాయి. దేశవ్యాప్తంగా రెన్యూవబుల్ ఎనర్జీ వేగంగా పెరుగుతున్న సమయంలో రాష్ట్రాల మధ్య పెట్టుబడుల కోసం పోటీ కూడా పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితిలో ఏపీ కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తోంది. ఒకటి.. భారీస్థాయి రెన్యూవబుల్ విద్యుదుత్పత్తి రాష్ట్రంగా ఎదగడం, రెండు.. ఆ విద్యుత్‌ను ఆధారంగా చేసుకుని కొత్త పరిశ్రమలను రాష్ట్రంలోనే ఏర్పాటు చేయడం. విద్యుత్‌ను ఉత్పత్తి చేసి బయటకు అమ్మడం ద్వారా ఒకస్థాయి ఆదాయం వస్తుంది. కానీ అదే విద్యుత్‌తో గ్రీన్ హైడ్రోజన్ తయారు చేసి, దానితో గ్రీన్ అమోనియా లేదా గ్రీన్ ఫ్యూయల్స్ తయారు చేసి, వాటిని పోర్టుల ద్వారా ఎగుమతి చేస్తే విలువ గొలుసు మరింత విస్తరిస్తుందన్నది కూటమి సర్కారు ప్రణాళిక. అదేవిధంగా క్లీన్ పవర్‌ను డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, గ్రీన్ స్టీల్, గ్రీన్ కెమికల్స్, రెన్యూవబుల్ పరికరాల తయారీకి వినియోగిస్తే విద్యుత్ ఒక ముడి వనరుగా కాకుండా పారిశ్రామిక అభివృద్ధికి బేస్‌గా మారుతుంది.

## 'పవర్'నుంచి 'పవర్‌ఫుల్ ఎకానమీ' వరకు

ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ మ్యాప్‌లో జరుగుతున్న మార్పును ఒక వాక్యంలో చెప్పాలంటే.. విద్యుదుత్పత్తి చేసే రాష్ట్రం నుంచి.. విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, నిల్వ చేసి, పరిశ్రమలకు అందించి, క్లీన్ ఎనర్జీ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి, ప్రపంచ మార్కెట్లకు పంపే రాష్ట్రంగా మారే ప్రయత్నం. ఇది ఒక్క ప్రభుత్వ శాఖతో సాధ్యమయ్యే మార్పు కాకపోవచ్చు. ఎనర్జీ, పరిశ్రమలు, ఐటీ, మౌలిక సదుపాయాలు, నీటి వనరులు, పోర్టులు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణం.. అన్ని శాఖలు ఒకే దిశలో పనిచేయాల్సి రావొచ్చు. చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వ ఆలోచన ఇదే. ప్రస్తుతం కేబినెట్ ఆమోదించిన కొత్త ఎనర్జీ ప్రాజెక్టులు, 24/7 పవర్ కోసం స్టోరేజ్ ప్రణాళికలు, ఇప్పటికే కొనసాగుతున్న భారీ సోలార్–విండ్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్‌పై దృష్టి, గ్రీన్ హైడ్రోజన్ పాలసీ, డేటా సెంటర్లకు రెన్యూవబుల్ ఎనర్జీ నిబంధనలు, పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నాలు.. ఇవన్నీ విడివిడిగా కనిపించినా ఒకే పెద్ద ఎనర్జీ వ్యూహంలోని భాగాలే. అందుకే –"ఎనర్జీ మ్యాప్‌లో ఏపీకి కొత్త రూపం" అంటున్నది.

రేపటి ప్రశ్న –ఎవరి దగ్గర ఎక్కువ విద్యుత్ ఉంది? అన్నది కాదు. ఎవరు చౌకగా, నమ్మకంగా, నిరంతరంగా, శుభ్రమైన విద్యుత్‌ను అందించగలరు? ఆ విద్యుత్‌తో ఎవరు ఎక్కువ విలువను సృష్టించగలరు? అన్నది. అదే భవిష్యత్ పారిశ్రామిక పోటీకి అసలు కొలమానం. ఆ పోటీలో సౌరశక్తి, పవన వనరులు, పంప్డ్ స్టోరేజ్ అవకాశాలు, తీర ప్రాంతం, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలు.. వీటన్నిటినీ కలిపి ప్రయోగించి రాష్ట్రానికి ఒక ప్రత్యేక ఎనర్జీ– ఇండస్ట్రీ మోడల్ నిర్మించాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి వ్యూహంలో ప్రధానాంశం. సోలార్ నుంచి స్టోరేజ్ వరకు.. స్టోరేజ్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకు.. అక్కడినుంచి పరిశ్రమలు, డేటా సెంటర్లు, తయారీ, ఎగుమతుల వరకు.. ఈ ప్రయాణమే ఏపీ కొత్త ఎనర్జీ మ్యాప్‌లో అంతర్లీనంగా రూపుదిద్దుకుంటున్న అసలు దృశ్యం!

చైతన్యరథం



ఫైల్ ఫోటో

## మంత్రి లోకేష్ చేతుల మీదుగా

# మరో 372మందికి పట్టాభిషేకం

మంగళగిరి (చైతన్య రథం): దశాబ్దాలుగా వారు అక్కడే నివసిస్తున్నారు. నానా కష్టాలుపడి ఇళ్లు నిర్మించుకున్నారు. సొంత ఇంట్లోనే ఉంటున్నా ఏదో తెలియని భయం. కష్టం వస్తే ఇల్లు అమ్మలేరు, ఎవరూ కొనరు. రుణం తీసుకుందామంటే యాజమాన్య పత్రాలు లేని దుస్థితి. సొంతింటి కల సాకారమైనా.. హక్కులు లేక దిక్కులు చూస్తున్న

**నేడు కుంచనపల్లిలో మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమం**

మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు.. నాడు నారా లోకేష్ ఇచ్చిన హామీ నేడు వరమైంది. ఎన్నో అడ్డంకులను అధిగమించి, న్యాయపరమైన వివాదాలు పరిష్కరించి.. పేదలకు హక్కు కల్పించే ఒక మహా యజ్ఞం చేపట్టారు మంత్రి నారా లోకేష్. ఇప్పటివరకు వేలాదిమందికి వేల కోట్ల విలువైన ఆస్తి హక్కులు కల్పించిన కార్యక్రమం "మన ఇల్లు-మన లోకేష్". సోమవారం తాడేపల్లి మండలం కుంచనపల్లి శ్రీ శ్రీనివాస కన్వెన్షన్స్‌లో పట్టాల పంపిణీ కార్యక్రమం మంత్రి లోకేష్ చేతుల మీదుగా జరగనుంది.

మరో 372మందికి పట్టాలు అందజేయనున్నారు. గత ఎన్నికల సమయంలో 2029లోగా నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న ప్రతి లబ్ధిదారుడికీ పట్టాలు అందజేస్తానని యువనేత లోకేష్ హామీ ఇచ్చారు.

ఆ మాట మేరకు ఇప్పటికే దాదాపు 80శాతం వరకూ పట్టాల సమస్యను పరిష్కరించారు. కేంద్ర ప్రభుత్వంతో ముడిపడివున్న మరికొన్ని భూముల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. వాటిపైనా కేంద్ర పెద్దలతో మంత్రి లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారు. మంగళగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి లోకేష్... తొలివిడతగా గతఏడాది ఏప్రిల్ నెలలో 3,002 మందికి, రెండోవిడత ఈ ఏడాది జులై నెలలో 2,634మందికి బట్టలు పెట్టి మరీ పట్టాలు అందజేశారు. మొదటి, రెండు విడతల్లో దాదాపు రూ.2వేల కోట్లు విలువైన భూములకు రూపాయి ఖర్చులేకుండా లబ్ధిదారులకు ఉచితంగా శాశ్వత పట్టాలను అందజేశారు.

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో అటవీ, ఇరిగేషన్, రెవిన్యూ, దేవాదాయ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల్లో పేదలు దాదాపు మూడు దశాబ్దాలకు పైబడి ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు.

ఇవన్నీ ప్రభుత్వానికి చెందిన ఆక్రమిత భూములు కావడంతో వీటికి ఎటువంటి పట్టాలు లేవు. అటువంటి వారికి పట్టాలు ఇప్పిస్తానని ఎన్నికలకు ముందు ప్రజలకు లోకేష్ హామీ ఇచ్చారు. నాడు ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చేందుకు వివిధ శాఖలకు చెందిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ పలుమార్లు సంప్రదింపులు జరిపి, కేబినెట్ వరకు తీసుకెళ్లి శాఖలవారీగా స్థలాల సమస్యను పరిష్కరించారు. యువనేత లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## పోర్టు నుంచి ప్రొడక్షన్‌కి..

# రూ.8వేల కోట్లతో గోవా షిప్‌యార్డ్ ప్రాజెక్టు

**నౌకల తయారీ, మరమ్మతులకు కేంద్రంగా బందరు**

**8,000 ఉద్యోగాల కల్పనకు అవకాశం**

అమరావతి (చైతన్య రథం): మచిలీపట్నం పోర్టు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడుతోంది. బందరు తీర ప్రాంతాన్ని నౌకల తయారీ, మరమ్మతుల కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ భారీ ప్రాజెక్టును ప్రతిపాదించింది. సుమారు రూ.8,000 కోట్ల పెట్టుబడితో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యూనిట్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో మచిలీపట్నం పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలకు ద్వారాలు తెరచుకున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 3,000, పరోక్షంగా 5,000 చొప్పున మొత్తం 8,000 ఉద్యోగాలు కల్పించే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

**రక్షణ రంగ తయారీకి వేదిక**

కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టులో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన నౌకలు, కోస్ట్‌గార్డ్ నౌకలతో పాటు వాణిజ్య, ఎగుమతి అవసరాలకు సంబంధించిన నౌకలను కూడా నిర్మించనుంది. నౌకల మరమ్మతుల సేవలూ అందుబాటులోకి రానున్నాయి. దీంతో



మచిలీపట్నం పోర్టు కార్యకలాపాలు కేవలం సరుకు రవాణాకే పరిమితం కాకుండా, సముద్ర ఆధారిత తయారీ పరిశ్రమలవైపు విస్తరించే అవకాశం ఉంది.



**స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు**

ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నౌకల నిర్మాణం, వెల్డింగ్, మెషినింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్, నాణ్యతా పరీక్షలు, నిర్వహణవంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన సిబ్బందికి ఉపాధి అవకాశాలు ఏర్పడవచ్చు. వీటితోపాటు విడిభాగాల సరఫరా, రవాణా, పారిశ్రామిక సేవలు, ఇతర అనుబంధ రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశముంది. స్థానిక యువతకు అవసరమైన సాంకేతిక శిక్షణ అందిస్తే ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు కృష్ణా జిల్లా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశాలు లేకపోలేదు.

**పోర్టు అభివృద్ధికి కొత్త దిశ**

మచిలీపట్నం పోర్టు అభివృద్ధితో పాటు షిప్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదన అమలులోకి వస్తే, ఈ ప్రాంతంలో పెట్టుబడులు, అనుబంధ పరిశ్రమలు పెరిగేందుకు అవకాశముంటుంది. అయితే ప్రాజెక్టు నిర్మాణం, ఉత్పత్తి ప్రారంభం, ఉద్యోగాల భర్తీవంటి తదుపరి దశలు నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాల్సి ఉంది. మొత్తంగా, మచిలీపట్నం పోర్టును నౌకల తయారీ, మరమ్మతుల కేంద్రంగా తీర్చిదిద్దే ఈ ప్రతిపాదన రాష్ట్ర సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలను తెరుస్తున్నట్టే. పోర్టునుంచి పారిశ్రామిక ఉత్పత్తి వరకు అభివృద్ధి విస్తరించినప్పుడే ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రాంతానికి ఆశించిన స్థాయిలో ఆర్థిక ప్రయోజనాలు అందుతాయన్నది కాదనలేని వాస్తవం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణకు సమాయత్తమవుతోంది.

# కూటమి సమన్వయమే విజయానికి కీలకం

- **అనుకూలమైన అభ్యర్థులను గుర్తించాలి**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**
- **విశాఖలో ఎన్డీఏ సమన్వయ సమావేశం**



విశాఖపట్నం(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల మధ్య సమన్వయానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలోని టీడీపీ జోనల్ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి సమన్వయ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, కూటమి పార్టీల మధ్య సమన్వయం, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చి నా ఎదుర్కొనేలా కూటమి శ్రేణులను సమాయత్తం చేయాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు పరస్పర సమ న్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయ కమిటీలు చురుగ్గా పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై సమగ్ర అవగాహన కలిగి ఉన్న అత్యంత అనుకూలమైన అభ్యర్థులను గుర్తించాలని నిర్ణయించారు. అలాగే క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు, రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను సవరించుకోవాలని సూచించారు.

ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం, క్షేత్రస్థాయి శ్రేణుల మధ్య నిరంతర సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని పల్లా పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి శ్రేణుల ఐక్యత, సమన్వయం, సమష్టి కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విశాఖ పట్నం జిల్లా పార్లమెంట్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఏ.షరీఫ్, విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నియోజక వర్గాల ఇన్‌చార్జిలు, కూటమి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల బాంధవుడు ముమ్మాటికీ చంద్రన్నే

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్**
- **జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు రిజర్వేషన్లలో ద్రోహం**
- **సబ్‌ప్లాన్ నిధులు దోచుకున్న దుర్మార్గుడు ఆయన**
- **రాజమండ్రిలో పెట్టిన సభ...నయవంచన సభ**
- **బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు గొడ్డలి పార్టీ అధినేతకు, నేతలకు లేదు**
- **గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి**




అమరావతి(చైతన్యరథం): బీసీలకు అన్ని విధాలా న్యాయం చేసి వారి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిన బీసీల బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబేనని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బీసీలకు అడుగడుగునా అన్యాయం చేసిన బీసీల ద్రోహి జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వారికి రాజ్యాధికారాన్ని ఇవ్వబోతున్న చంద్రబాబుకు బీసీల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నా బీసీలు నా వెన్నుముక అంటూనే జగన్‌రెడ్డి బీసీల వెన్నుముకను ఐదేళ్ల తన పాలనలో విరగ్గొట్టాడు. బీసీల అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేశాడు. ఇదేంటని ప్రశ్నించిన నా బీసీ సోదరులను పొట్టనపెట్టుకున్నాడు. నిజాయితీగా ఒకే పార్టీలో ఉండి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నా బీసీ సోదరులను నడిరోడ్డు మీద అత్యంత కర్కశం గా పీకకోసి చంపేశారు. వైసీపీ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాల ను నిలదీసిన బీసీలను అణగదొక్కిన దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి. తన క్యాబినెట్‌లోని బీసీ మంత్రులను తోలుబొమ్మలుగా చేసి వారు ప్రశ్నించకుండా ఆరాధించేలా వారితో తోలుబొమ్మలాట ఆడించాడు. ఆ మాట స్వయంగా తన క్యాబినెట్‌లోని బీసీ మంత్రే విలేకరుల సమావేశంలో చెప్పాడు. గొడ్డలి పార్టీ అధినేత, నాయ కులకు రాష్ట్రంలోని బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు, విలువ లేదు. మా కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తున్న ఘనత చంద్రబాబుది. యువ నాయకులు లోకేష్ సైతం బీసీల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారు.

### రెండేళ్లలోనే బీసీలకు రూ.32,534 కోట్ల సంక్షేమం

బీసీలకు కేవలం ఈ రెండేళ్లలోనే వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా రూ.32,534 కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇచ్చాం. కల్లుగీత కార్మి కులకు 10శాతం ఎక్సైజ్ షాపులు కేటాయిం చాం. నేతన్న సేవలో పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు ఆర్థికసాయం అంది స్తున్నాం. హ్యాండ్‌లూమ్ మగ్గాలు ఉన్న వారికి నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలు ఉన్నవారికి నెలకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నాం. వేట నిషేధ సమ యంలో ఆర్థికసాయం మత్స్యకారుల సేవలో పథకంతో రూ.20 వేలు అందిస్తున్నాం. సబ్సిడీతో మత్స్యకారులకు బోట్లు, డీజిల్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం దుర్మార్గంగా తెచ్చిన జీఓ నంబర్ 217ను రద్దు చేసి వేటపై ఆంక్షలు ఎత్తివేశాం. నాయీ బ్రాహ్మణు లకు భృతిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచామని వివరించారు.

### బీసీలను మోసగించేందుకు వైసీపీ కుట్ర గర్జనలు దుర్మార్గం

అమాయకులైన నా బీసీ కుటుంబసభ్యులను 2019లో మోసం చేసినట్లు మరోసారి మోసం చేయడానికి గొడ్డలి పార్టీ అధినేత జగన్‌రెడ్డి, తన పార్టీ నాయకులు కుట్రపూరిత గర్జనలు పెడుతున్నారు. జగన్‌రెడ్డిని బీసీలు నమ్మే పరిస్థితి లేదు. రాజమం డ్రిలో పెట్టిన బీసీల గర్జన సభ బీసీల నయవంచన సభ. అధికార దాహంతో రగిలిపోతున్న ఆయన బీసీలకు మరోసారి తన అబద్దా ల అస్త్రాలతో మోసపూరిత మాటలు చెప్పించాడు. కూటమి పాలనలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం సీట్లలో నా బీసీ సోదరులు అధికార పీఠంపై కూర్చోబోతున్నారు. జగన్‌రెడ్డి తన పాలనలో 10 శాతం రిజర్వేషన్లు తగ్గించడం వల్ల దగాపడిన నా బీసీ సోదరులు మా కూటమి ప్రభుత్వంలో న్యాయం పొందబోతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో జగన్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలు పటాపంచలు కాబోతున్నాయి. ఇది రాసిపెట్టుకోవాలని హెచ్చరించారు.

# పల్లె పండుగ 3.0 విజయవంతం చేయాలి

- **మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపు**
- **ఆత్మకూరులో కూటమి నాయకులతో సమావేశం**
- **రామాపురంలో సీఎం సభకు భారీ జనసమీకరణ**




నెల్లూరు(చైతన్యరథం): నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ఈ నెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా జరగనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎన్డీఏ కూటమి శ్రేణులు సమాయత్తం కావాలని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణం లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కోఆర్డినేటర్ కొమ్మలపాటి శ్రీధర్ తో కలిసి ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులతో మంత్రి ఆనం ప్రత్యేక సమావేశం నిర్వహించి సభ ఏర్పాట్లు, జనసమీకరణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలు, కూటమి శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. రామాపురంలో జరిగే పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా నిలిచేలా నిర్వహించాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామం నుంచి పెద్దఎత్తున ప్రజలు, కూట మి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేలా ముంద స్తు కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పార్కింగ్, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు తదితర ఏర్పాట్ల ను సమన్వయంతో చేపట్టాలని స్పష్టం చేశారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### లక్ష మందితో భారీ బహిరంగ సభ

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొనే రామాపురం సభకు భారీగా ప్రజలను తరలించి లక్ష మందితో భారీ బహిరంగ సభగా నిర్వహించేలా కూటమి శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత వచ్చేలా పెద్దఎత్తున ప్రజల భాగస్వామ్యాన్ని కల్పించాలని కోరారు. ఉదయగిరి, ఆత్మకూరు వంటి మెట్ట ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి పల్లె పండుగ 3.0 ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ కొమ్మలపాటి శ్రీధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యాటకాంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యం

- జీడీపీలో అత్యధిక వాటా సాధించడమే లక్ష్యం
- ఏపీని చూస్తే దేశం అంతటినీ చూసినట్టే
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- రాజమండ్రిలో అంగరంగ వైభవంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు




రాజమండ్రి(చైతన్యరథం): పర్యాటకాంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్ లో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని పర్యాటక రంగ అభివృద్ధిపై సుదీర్ఘంగా ప్రసంగించారు. గత రెండున్నర ఏళ్లలో చేపట్టిన పర్యాటకరంగ అభివృద్ధిని, రాబోయే మూడేళ్లలో చేపట్టబోయే ప్రణాళికలను సవివరంగా వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చొరవతో పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడం తో భారీగా ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారు. తద్వారా కేవలం రెండున్నర ఏళ్ల కాలంలోనే 20 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం శుభపరిణామం. పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం 'నూతన పర్యాటక పాలసీ (2024-29)', ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ, ఎంప్లాయిమెంట్ జనరేషన్ పాలసీ, కారవాన్ టూరిజం, హోంస్టే, బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పాలసీ తదితర అనుబంధ పాలసీలను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఉన్న వనరులను అందుబాటులోకి తేవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక తలను వినియోగిస్తున్నాం. 'ఎక్స్‌ప్లర్జర్' సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో పర్యాటక ప్రాంతాల విశిష్టతను 130 భాషల్లో, 100కు పైగా పర్యాటక ప్రాంతాల విశిష్టత సులభంగా తెలిసేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

పారిశ్రామిక రంగం తర్వాత అత్యధిక ఉపాధి కల్పించేది పర్యాటక రంగమే. చదువుకున్న వారికే కాకుండా చదువుకోని స్థానికులకు, టూరిస్ట్ గైడ్లు, ఆటో డ్రైవర్లు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి.

ఉపాధిని కల్పించే ఇన్వెస్టర్లకు ప్రభు త్వం ప్రత్యేక రాయితీలు ఇస్తోందని, యువత తమ భవిష్యత్తు కోసం పర్యాటక రంగాన్ని ఎంచుకోవాలని పిలుపునిచ్చారు.




## దేశంలో ఉన్న ప్రదేశాలన్నీ ఏపీలో ఉన్నాయి

భారతదేశంలో ఉన్న ప్రదేశాలన్నీ ఏపీలోనే ఉన్నాయని, ఏపీని చూస్తే భారతదేశం అంతటినీ చూసినట్టేనని పేర్కొన్నారు. సుదీర్ఘ సముద్ర తీరం, పంచారామాలు, జ్యోతిర్లింగాలు, శక్తిపీఠాలు, తిరుమల, శ్రీశైలం, సింహాచలం వంటి పుణ్యక్షేత్రాలతో పాటు అరకు, బొర్రా గుహలు, బెలూన్ గుహలు, మారేడుమిల్లి, లంబసింగి, గండికోట వంటి ప్రకృతి సౌందర్య ప్రదేశాలు ఎకో టూరిజానికి పెద్దపీట వేస్తున్నాయన్నారు. ప్రముఖ నటుడు రజనీకాంత్ సైతం తన సినిమాలో ఒక షాట్‌ను మారేడుమిల్లి దగ్గర తీయాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీకి సొంతమైన అరకు కాఫీని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించిన వైనం, మారేడుమిల్లి బాంబో చికెన్, ఆయుర్వేదం, యోగ, ప్రకృ తి వైద్యం ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ఇప్పటివరకు 21 వస్తువు లకు జీఐ ట్యాగ్ కల్పించామని చెప్పారు.

## గోదావరి పుష్కరాలకు కర్టెన్ రైజర్ కార్యక్రమం

2027లో జరగబోయే గోదావరి పుష్కరాలకు ఇది కర్టెన్ రైజర్ కార్యక్రమం అని పేర్కొంటూ 'గోదావరి పిలుస్తోంది - ది గోదా వరి కాల్స్' పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కుంభమేళా తరహాలో పుష్కరాలను నిర్వహించి గోదావరి పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తామని, ఆంధ్ర వంటకాలను ప్రపంచానికి పరిచయం చేస్తామని చెప్పారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు ద్వారా హేవలాక్ వంతెన పుష్కర్ ఘాట్ అభివృద్ధి, కడియం నర్సరీలు, నిడదవోలు, శెట్టిపేట, కోట సత్తెమ్మ దేవాలయాల అభివృద్ధిని చేపడుతున్నాం. బ్రిడ్జ్ లంకలో టెంట్ సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి 8 పర్యాటక ప్రాజెక్టుల ద్వారా రూ.428 కోట్లు కేటా యించిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

పర్యాటకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు డబుల్ డెక్కర్ బస్సుల్లో పర్యటించి గోదావరి ప్రాంతాలపై రూపొందించిన వీడియోలను విశ్వవ్యాప్తం చేస్తున్నామని తెలిపారు. జీడీపీలో పర్యాటక రంగం ద్వారా అత్యధిక వాటా సాధించడమే లక్ష్యంగా అటవీ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, ఎండోమెంట్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. హోటల్స్ అసోసియేషన్, ట్రావెల్స్ ఆపరేటర్స్, ఏపీ ఛాంబర్స్ పర్యాటక అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పర్యాటక,సాంస్కృతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, రాజమహేంద్ర వరం మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా, సబ్ కలెక్టర్ ఆదిత్య శర్మ, ఏపీ ఛాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర్‌రావు, ఏపీ ట్రావెల్స్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ విజయ్ మోహన్, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.వి.స్వామి, టూరిజం డైరెక్టర్లు వాసురెడ్డి రాంబాబు, గంటా స్వరూప, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, పర్యాటక రంగ ప్రతినిధులు, నిపుణులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పర్యాటక రంగ ఏవీ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు అతిథులు అవార్డులు ప్రదానం చేశారు.

# సింహపురి రూపురేఖలు మారుస్తాం

- నెల్లూరుకు దేశపటంలో ప్రత్యేక గుర్తింపు తెస్తా
- లోకేష్ ఆలోచనలతో విద్యావ్యవస్థలో సంస్కరణలు
- హైస్కూళ్లను వచ్చే విద్యాసంవత్సరానికి సిద్ధం చేస్తా
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ
- నెల్లూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో హైస్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు(చైతన్యరథం): పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలని తాను రాజకీయాల్లోకి వచ్చానని ఏపీ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రభు త్వ నిధులతో పాటు తన సొంతనిధులను కూడా పేదల అభివృ ద్ధికి వెచ్చిస్తున్నానని వెల్లడించారు. వీఆర్సీ స్ఫూర్తితో జాకీర్ హుస్సేన్ నగర్ హైస్కూల్‌ను రూ.13 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు అంటోని కనస్ట్రక్షన్స్ ముందుకు వచ్చిందని తెలిపారు. తన కుమార్తె శరణితో కలిసి ఆదివారం హైస్కూల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. కష్టపడి చదివి ఈ స్థాయికి ఎదిగాను. ఎన్నికల ప్రచారంలో పేదపిల్లల పరిస్థితి చూసి చలించిపోయాను. వారికి విద్యను ఆస్తిగా ఇవ్వాలని నిర్ణయించుకున్నా. స్నేహితులు, దాతల సహకారంతో లక్ష్యం వైపు ముందుకు సాగుతున్నా. అన్ని హైస్కూళ్లని వచ్చే విద్యా సంవత్సరా నికి సిద్ధం చేస్తా. సింహపురి రూపురేఖలు మారుస్తాం. భారతదేశ పటంలో నెల్లూరు నగరానికి ప్రత్యేక గుర్తింపు తెస్తామని తెలిపా రు. పేదల కష్టాలు నాకు తెలియవని భావించే వాళ్లు అవివేకులు. గొడ్డలి పార్టీ మూసేసిన వీఆర్సీని నాలుగు నెలల్లో ఆధునికీ కరించామని వ్యాఖ్యానించారు. రూ. 8 కోట్ల సొంత నిధులతో ప్రభుత్వ హైస్కూల్ పిల్లలకు 10 వేల సైకిళ్లు పంపిణీ చేశామని వెల్లడించారు. భగత్ సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువ కట్ట వాసులకు 2615 శాశ్వత పట్టాలు మంజూరు చేశామని వివరిం చారు. నెల్లూరు సిటీలో 5 వేల కుటుంబాలకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని మాటిచ్చారు. పేదలకు ఏ కష్టం వచ్చినా తన కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భారత దేశ పటంలో నెల్లూరు నగరానికి ప్రత్యేక గుర్తింపు తెస్తానని ఉద్ఘాటించారు. లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు జరుగుతున్నాయని తెలిపారు.

# సబ్బవరంలో ఫైర్ స్టేషన్ ప్రారంభం






పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి(చైతన్యరథం): హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. సబ్బవరంలో ఫైర్ స్టేషన్ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. 15 ఆర్థిక సంఘం నిధులతో రూ.1.60 కోట్లతో నిర్మించిన సబ్బవరం అగ్నిమాపక కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. అగ్నిమాపక కేంద్రంలో గదులను పరిశీలించా రు. అనంతరం అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఫైర్ పరికరాల పనితీరును శాఖ అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ప్రాంగణంలో హెూంమంత్రి అనిత, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడు తూ సబ్బవరం సొంతూరు, సబ్బవరం రావడం ఎంతో ఆనందం గా ఉంటుందని తెలిపారు. ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు అద్భు తంగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏదైనా విపత్తు వచ్చిన ప్పుడు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తారు. బుడమేరు సమయంలో ఇంటింటికి వెళ్లి పరిసరాలను శుభ్రం చేశారు. కూటమి పాలనలో అనేక నూతన అగ్నిమాపక కేంద్రా లను నిర్మించాం. పెద్ద మొత్తంలో వాహనాలను కూడా కొనుగోలు చేశాం. మా నాన్న, తాత పేరు మీద ఒక కళ్యాణ మండపం కట్టా లని నన్ను కోరారు. మా తాత పేరు మీద సబ్బవరంలో ఒక కళ్యాణ మండపాన్ని త్వరలోనే నిర్మిస్తాము. నాకు బాధ్యత ఉన్న నియోజకవర్గం పెందుర్తి. పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు సత్తా చాటాలని కోరారు.

# ప్రజలకు పారదర్శకమైన పాలన కూటమి లక్ష్యం

- వైసీపీ ఐదేళ్లలో మురుగు కాల్వలూ శుభ్రం చేయలేదు
- కూటమి వచ్చాక బందరులో అభివృద్ధి, మౌలికవసతులు
- పేర్ని నాని దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదు
- వాళ్లు ఇచ్చిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందితే
- నేడు వారే ఫేక్ అని చెప్పడం దిగజారుడుతనం
- జగన్‌రెడ్డికి, వైసీపీ నాయకులకు గుణపాఠం తథ్యం
- ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్



మచిలీపట్నం(చైతన్యరథం): ప్రజల సమస్యలను తెలుసు కుని వాటికి పరిష్కారం చూపించే లక్ష్యంతో ప్రజాదర్బార్ నిర్వ హిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్ర మం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే లక్ష్యంతో విధిగా గ్రీవెన్స్ నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో సమస్యలు చెప్పుకోవాలంటే దిక్కులేని పరిస్థితి నెలకొంది. సమస్య బయట ఎవరికైనా చెబితే దాడులు బెదిరింపులకు దిగారు. కానీ నేడు పారదర్శకంగా ప్రజ లకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో కారణంగా ఇబ్బందులు ఉన్నా కృష్ణా జిల్లాను పట్టిసీమతో సస్యశ్యామలం చేశారు. ఇప్పుడు వర్షాలు కూడా సమృద్ధిగా కురవడంతో అన్ని ప్రాంతాలు జలకళతో కళకళలాడుతున్నాయి. పులిచింతల, నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీ నిండు కుండల్లా మారాయి. అదే సమయంలో మరింతగా నీరు నిల్వ చేసుకునే లక్ష్యంతో ప్రకాశం బ్యారేజీ ఎగువన, దిగువన మరో రెండో బ్యారేజీలు నిర్మించాలని భావిస్తున్నాం. తద్వారా కృష్ణా డెల్టాకు ఎప్పుడూ సాగునీటి కొరత లేకుండా చూడాలని చూస్తున్నామని వివరిం చారు.

**మచిలీపట్నంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక కార్యాచరణ**

యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా పని చేస్తున్నాం. బందరు పోర్టు పూర్తి చేస్తున్నాం. పోర్టుకు అనుబంధం గా గోవా షిప్ యార్డు వచ్చింది. రూ.8 వేల కోట్ల వ్యయంతో 10 వేల మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు చేయబోతున్నాం. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్లు అడ్డగోలుగా తొలగిస్తే.. ప్రస్తుతం ఎప్పటికప్పుడు పెన్షన్లు మంజూరు చేస్తున్నాం. ప్రతి పేద వాని సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇళ్ల నిర్మాణానికి శ్రీకా రం చుట్టాం. మచిలీపట్నంలో 3 వేల ఇళ్ల నిర్మాణాలకు దరఖా స్తులు పంపించాం. స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలనుకునే వారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందిస్తాం. మచిలీపట్నంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. అందుకే వాటిని పూర్తి చేసేందుకు అధికారులతో చర్చిస్తున్నాం. మచిలీపట్నం నియోజకవర్గం వ్యాప్తంగా డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా పనులు చేపట్టాం. భవిష్యత్తులో మచిలీపట్నానికి మురుగు అనే సమస్య లేకుండా అమృత్, 15వ ఆర్థిక సంఘం, పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నాం. శ్మశాన వాటికలు, రోడ్ల నిర్మా ణాల పనులు కూడా వేగవంతం చేశాం. పేర్ని నాని బందరుని అడ్డు పెట్టుకుని దోచుకోవడం తప్ప సాధించిందేమీ లేదు. ఐదేళ్లు అధికారంలో ఉండి జిల్లాకు ఏం ఉద్ధరించారో చెప్పగలరా? మచిలీపట్నానికి ఐదేళ్లలో ఎంత నిధులు తెచ్చారో సమాధానం చెప్పగలరా? అని ప్రశ్నించారు. ఐదేళ్లు డీఎస్సీ అనేది లేకుండా చేసినోళ్లు కూడా నేడు డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్నా రు. వాళ్ల ప్రభుత్వంలో స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇచ్చి ఆ సర్టిఫికెట్లతో ఈ రోజు ఉద్యోగాలు పొందితే అవి ఫేక్ అంటున్నాడు. ఇలాంటి డబుల్ గేమ్ నాయకులకు.. రెండు నాలుకల వ్యక్తులకు ప్రజలు గుణపాఠం చెప్పడం తథ్యమని హెచ్చరించారు.



# టెక్కలి టీడీపీలోకి భారీగా చేరికలు

టెక్కలి (చైతన్యరథం): మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో టెక్కలిలో వైసీపీ నుంచి 500 మంది కార్యకర్తలు టీడీపీలో చేరా రు. సీతాపురం, తిర్లంగి పంచాయతీల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఆ కుటుంబాలకు మంత్రి కండువాలు కప్పి ఆహ్వానిం చారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయానికి వచ్చిన వారంతా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో సంక్షేమం, అభివృద్ధిని చూసి టీడీపీ వైపు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లా డుతూ టెక్కలిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమ ని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. 44 ఏళ్లుగా టెక్కలి అభివృద్ధికి కింజరాపు కుటుంబం కృషి చేస్తుందని చెప్పారు.



# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



రాయచోటి(చైతన్యరథం): చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామం బోరెడ్డిగారి పల్లెలోని తన సొంత నివాసంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని వారి సమస్య లను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన అర్జీలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబా టులో ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కా రానికి కృషి చేయడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**సమస్యలు పరిష్కరించేలా పనిచేస్తున్నాం: మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి**




విజయవాడ(చైతన్యరథం): ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన హక్కులు, సౌకర్యాల విషయం లో ఎక్కడా రాజీ పడకుండా, ఉద్యోగుల ప్రయోజనాలకు అను గుణంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగు తోందని చెప్పారు. గతంలో సీసీ రూల్స్, విధివిధానాలను పూర్తిస్థాయిలో పాటించకుండా కొన్ని నియామకాలు జరిగిన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల క్రమబద్ధీకరణ, రేషనలైజేషన్‌తో పాటు వారికి అందాల్సిన సౌకర్యాలను కల్పించడంపై దృష్టి సారిం చిందన్నారు. ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాల్సిన సమయంలో గత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని, తమ ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగుతోందని తెలిపారు. అలాగే నోషనల్ ఇంక్రిమెంట్స్ వంటి అంశాలను కూడా ఉద్యోగుల ప్రయోజనాల కోణంలో పరిశీలిస్తున్నామని చెప్పారు. జీవో నంబర్ 11కు సంబంధించి కూడా గతంలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు తదితర కింది స్థాయి ఉద్యోగులు నిర్వహించే పనులకు సంబంధిం చి సిబ్బంది నియామకాలు చేపట్టిన పరిస్థితులు ఉన్నాయని వివ రించారు. అదే సమయంలో ప్రజలకు అందే పౌరసేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమ న్నారు. ఉద్యోగులకు మరింత అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు సెలవుల కోసం దరఖాస్తు చేసిన తర్వాత పై అధికారి నుంచి అనుమతి ఆలస్యమైనా, నిబం ధనల మేరకు రెండురోజుల క్యాజువల్ లీవ్ మంజూరయ్యే విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఇది ఉద్యోగులకు మరింత సౌలభ్యాన్ని కల్పించే ఎంప్లాయ్ ఫ్రెండ్లీ విధానంలో భాగమని పేర్కొన్నారు. ప్రమోషన్ల విషయంలో కూడా ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, సంబంధిత సెక్రటరీలతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలి పారు. ఉద్యోగులు, ప్రభుత్వం పరస్పర సఖ్యతతో ముందుకు సాగినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

**- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుక బడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం శాతం రిజర్వేషన్ కల్పించే అంశాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల రాజకీయ సాధికారత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. కేవలం సంక్షేమానికే పరిమితం కాకుండా రాజకీయంగానూ వారికి సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మరో వైపు, ఈ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేదని మంత్రి వాసంశెట్టి స్పష్టం చేశారు. అన్ని వర్గాల హక్కులను కాపాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ మేరకు 2024 నుంచి వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.32,534 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. చేనేత, పవర్ లూమ్ కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. నేతన్నల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, చేనేత రంగానికి విద్యుత్ రాయితీలు కల్పిస్తున్నామని వివరించారు. చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వాసంశెట్టి గుర్తు చేశారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయం లో ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జీవనోపాధికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి స్కాల ర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను కొనసాగి స్తున్నామని తెలిపారు.

## స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

**పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్**

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఈ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు (జీవోఎంఎస్ 244) జారీ చేసింది. వార్డు సచివాలయ సిబ్బందికి ప్రమోషన్ ఛానెల్‌ను సుగమం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మిగులు పోస్టుల సర్దుబాటు ద్వారా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కల్పనకు ఏపీ సర్కార్ ఆమోదం తెలిపింది. అర్హత కలిగిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు నూతనంగా క్రియేట్ చేసిన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోకి ప్రమోషన్లను కూటమి ప్రభుత్వం కల్పించింది. వార్డు అడ్మినిస్ట్రేటి వ్ సెక్రటరీల ప్రమోషన్ల అనంతరం, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా పదోన్నతులను కల్పించింది. 815 వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్-II) పోస్టులను గ్రేడ్-Iగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. 815 వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ (గ్రేడ్-II) పోస్టులను కూడా గ్రేడ్-I హోదాకు అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా ఈ పోస్టుల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేసింది.

# అడ్డంకులు ఎదురైనా షాదీఖానా నిర్మించాం

**గత ప్రభుత్వంలో జైలుకు కూడా పంపారు: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం**



నంద్యాల(చైతన్యరథం): ఎన్ని అడ్డంకులు ఎదురైనా బనగాన పల్లెలో షాదీఖానా నిర్మిస్తానని జీఎమ్ సెంటర్‌లో తొడగొట్టి చెప్పానని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను ఇచ్చిన మాట ప్రకారం దీనిని నిర్మించి నేడు ప్రారంభించామని.. ఈ రోజును తాను మర్చిపోలేనని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా లోని బనగానపల్లెలో ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.2.60 కోట్లతో నిర్మించిన షాదీఖానాను మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ హయాంలో షాదీఖానా కు జీవో ఎక్కడ జారీ చేశారో చూపించాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం షాదీఖానా కట్టడంతో ఆయనకు జలసీగా ఉందని విమర్శించారు.

దీనికి సంబంధించిన జీవో కాపీని కాటసానికి వాట్సాప్‌లో పంపించా నని.. కానీ ఆయన చూసుకోలేదని తెలిపారు. తన సొంత నిధులతో షాదీఖానాను పూర్తి చేస్తానని చెప్పానని.. అయితే వైసీపీ హయాంలో వెంటనే తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపించారని ధ్వజమెత్తారు. పోలవరం, నాగార్జున సాగర్ కట్టావా అని కాటసాని రామిరెడ్డి తనపై సెటైర్లు వేస్తున్నా రని ఆగ్రహించారు. లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా రూ.16 కోట్లతో దద్దనాల చెరువును అభివృద్ధి చేశానని.. ఇది తన చరిత్ర అని ఉద్ఘాటించారు. వాటర్ ప్లాంట్‌లను ధ్వంసం చేసిన చరిత్ర కాటసానిదని మండిపడ్డారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో తన ఫొటో ఉండటం చూసి ఆయన ఓర్వలేక పోతున్నారని దుయ్యబట్టారు. బనగానపల్లె అభివృద్ధి కోసం కాటసాని ఏమి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలతో

# పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

**మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి**



విశాఖపట్నం(చైతన్యరథం): పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్ ఉన్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సాంఘిక సంక్షేమ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, మేగాద్రిగడ్డ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆదివారం మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, స్థానిక ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు)తో కలిసి సందర్శిం చారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఐఐటీ/నీట్ ఫ్యాకల్టీతో మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడి విద్యార్థులకు అందుతున్న కోచింగ్, విద్యా ప్రమాణాలు, భోజన వసతులు, ఇతర మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఆరోగ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ లక్ష్యాలను వదులుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి మరింత మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# పర్యాటక రంగంతో మరిన్ని అవకాశాలు

- **సందర్శనీయ సర్క్యూట్లను అభివృద్ధి చేయాలి**
- **ఏపీ సమగ్ర పర్యాటకానికి గేట్‌వేగా తిరుపతి**
- **ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజి**

తిరుపతి (చైతన్యరథం): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఛైర్మన్ నూకసాని బాలాజి పాల్గొన్నారు. పర్యాటకం కేవలం ఒక ప్రాంతాన్ని సందర్శించడం మాత్రమే కాదని, ప్రజలను, సంస్కృతులను, ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించే శక్తివంతమైన రంగమని అన్నారు. పర్యాటక రంగం ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, యువతకు అవకా శాలు, మహిళా సాధికారత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం ఎంతో కీలక మని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన టూరిజం పాలసీ 2024-29లో



పర్యాటక ఉత్పత్తుల వైవిధ్యీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నైపుణ్యాభివృద్ధి, స్థిరమైన బాధ్యతాయుతమైన పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. ఈ విధానంలో విశాఖ పట్నం, తిరుపతి, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోటల ను ఏడు ప్రధాన యాంకర్ హబ్స్‌గా గుర్తించారని చెప్పారు. ఒకే పర్యాటక ప్రదేశాన్ని సందర్శించి తిరిగి వెళ్లే విధానం నుంచి, ఒక ప్రధాన పర్యాటక కేంద్రం చుట్టూ అనేక ప్రాంతాలను అనుసంధా నించే డెస్టినేషన్ నెట్‌వర్క్ టూరిజం వైపు మనం ముందుకు సాగాలి. పర్యాటకులు ఎక్కువ రోజులు రాష్ట్రంలో ఉండేలా మరి న్ని ప్రాంతాలను సందర్శించేలా పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

**తిరుపతి సమగ్ర పర్యాటకానికి గేట్‌వే**

తిరుపతి ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఉన్నప్పటికీ దీనిని ఆంధ్రప్రదేశ్ సమగ్ర పర్యాటకానికి గేట్‌వేగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. తిరుపతికి వచ్చే భక్తులు, పర్యాటకులు ఆధ్యాత్మికతతో పాటు వారసత్వం, ప్రకృతి, సంస్కృతి, ఆహారం, అడ్వెంచర్, గ్రామీణ జీవన విధానాన్ని కూడా అనుభవించేలా పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలి. తిరుపతి జిల్లాలో ఇప్పటికే ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఎకో, అటవీ, పురావస్తు తదితర విభిన్న పర్యాటక అవకాశాలు ఉన్నాయని జిల్లా అధికారిక పర్యాటక సమాచారం కూడా పేర్కొంటోంది. తలకోన, పులికాట్, కపిలతీర్థం, గోవిందరాజ స్వామి ఆలయం, తిరుమల తదితర ప్రాంతాలు జిల్లాలోని విభిన్న పర్యాటక సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

# మంత్రి అచ్చెన్నాయుడు ఇలాకాలో వైసీపీ ఖాళీ

## సీతాపురం, తిర్లంగి పంచాయతీల నుండి టీడీపీలో చేరిన 500 కుటుంబాలు



కోటబొమ్మాళి: సెప్టెంబర్ 27

టెక్కలి మండలంలోని సీతాపురం, తిర్లంగి పంచాయతీల పరిధిలో వైకాపా పార్టీకి చెందిన సుమారు 500 మంది కార్యకర్తలు, కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకొని పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీతాపురం పంచాయతీ పరిధిలోని వీర రామకృష్ణాపురం, అలాగే తిర్లంగి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరడం పట్ల పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న నాయకులు తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రజాస్వామ్యంలో ప్రధాన బాధ్యత అని అన్నారు. టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తెలుగు దేశం పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, గృహ నిర్మాణం, పింఛన్లు, రైతులు, మహిళలు, పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

టెక్కలి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తాను ఓట్లు వేసిన గ్రామాలతో పాటు, గతంలో రాజకీయంగా భిన్నంగా ఉన్న గ్రామాల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు.

44 ఏళ్లుగా టెక్కలి అభివృద్ధికి కింజరాపు కుటుంబం కృషి

టెక్కలి నియోజకవర్గంతో పాటు గతంలో ఉన్న హరిశ్చంద్రపురం నియోజకవర్గంలో దాదాపు 44 ఏళ్లుగా తమ కుటుంబం రాజకీయంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు అనంతరం తాను కూడా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. సీతాపురం పంచాయతీ పరిధిలోని సీతాపురం, వెంకటాపురం గ్రామాల్లో గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇటీవల ఆయా గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించానని అచ్చెన్నాయుడు తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. టెక్కలి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళు_న్నామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాజకీయంగా భిన్నంగా ఉన్న గ్రామాలతో సహా అన్ని ప్రాంతాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.నావీజ ఛైర్మన్ బగాది శేషగిరిరావు,వైకాపాకు చెందిన బెండి శ్రీనివాసరావు, బెండి అప్పలసూర్యనారాయణ, టి. జగ్గారావు, బెండి కామరాజు, సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగు దేశం పార్టీ లో చేరారు.

# విద్యార్థులు, యువత భవిష్యత్తుపై అవగాహన ఉండాలి

## భరోసా కల్పించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ లంక శ్యామల రావు, ముఖ్య నాయకులతో కలిసి విద్యార్థులతో సమావేశమయ్యారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలు, జాబ్ క్యాలెండర్, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించి, నియామకాల్లో పారదర్శకతపై భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుఆధ్వర్యంలో, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో దేశ, విదేశీ సంస్థలతో ఎంఓయూలు, విశాఖను డేటా హబ్‌గా అభివృద్ధి చేయడం, గూగుల్ డేటా సెంటర్, కాగ్నిజెంట్ వంటి సంస్థల ద్వారా ఉపాధి అవకాశాల విస్తరణ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా వేలాది ఉద్యోగాల సృష్టికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కేంద్రంతో సమన్వయం, పెట్టుబడుల ఆకర్షణ ద్వారా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత భాగస్వాములు కావాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.

# విద్యార్థులు, యువత భవిష్యత్తుపై భరోసా

## కల్పించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ లంక శ్యామల రావు, ముఖ్య నాయకులతో కలిసి శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులతో సమావేశమై వారి భవిష్యత్తు, ఉపాధి అవకాశాలపై చర్చించారు. మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలు, జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో దేశ, విదేశీ సంస్థలతో ఎంఓయూలు, విశాఖను డేటా హబ్‌గా అభివృద్ధి చేయడం, గూగుల్ డేటా సెంటర్, కాగ్నిజెంట్ వంటి సంస్థల ద్వారా ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కేంద్రంతో సమన్వయం, పెట్టుబడుల ఆకర్షణ ద్వారా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత భాగస్వాములు కావాలని, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.





# రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

## పంపింగ్ మెయిన్ ప్రారంభించిన చీఫ్ విప్ జీవీ



వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో రూ. 14.70 లక్షల వ్యయంతో నిర్మించిన 'పంపింగ్ మెయిన్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం 'మీ భూమి – మీ హక్కు' పథకంలో భాగంగా రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. జీవీ గారు మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాగు నీటి సమస్యల పరిష్కారంతో పాటు భూ హక్కుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు గారు జనసేన నాయకులు నిశంకర్ శ్రీనివాసరావు, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

జోన్ - 2 (కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)

చైతన్యరథం

# దివంగత టీడీపీ నేత ఆళ్ల నాని మృతి తీరని లోటు

## చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ఏలూరు (చైతన్యరథం): ఇటీవల గుండెపోటుకు గురి అయ్యి ఆకస్మికంగా మృతి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నాయకులు దివంగత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) సంస్మరణ సభ ఆదివారం ఏలూరులోని క్రాంతి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దెందులూరు శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ హాజరై, ఆళ్ల నాని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. ఏలూరులోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో తాను చదువుతున్నప్పుడు విద్యార్థి దశ నుంచే తనకు ఆళ్ల నానితో ఎంతో స్నేహపూర్వక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రంగప్రవేశం చేసిన నాని, ఎమ్మెల్యే స్థాయి నుంచి డిప్యూటీ సీఎం వరకు ఎదగడం ఎంతో అభినందనీయమని, తన 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎంతోమంది ఆత్మీయులను, అభిమానులను సంపాదించుకున్నారని కొనియాడారు. ప్రజల మనిషిగా పేరుగాంచిన ఆయన అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, బాధను కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆకస్మిక మృతి జిల్లా రాజకీయ రంగానికి, ప్రత్యేకించి వారి కుటుంబానికి పూడ్చలేని లోటని పేర్కొన్నారు. ఆళ్ల నాని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు..



# మున్సిపల్ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించాలి

## కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో నాయకుల పిలుపు

నర్సీపట్నం (చైతన్యరథం): వచ్చే మున్సిపాలిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల పూర్తిస్థాయి విజయాన్ని ఖరారు చేసేందుకు నర్సీపట్నంలో కూటమి నాయకుల ముఖ్యమైన కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, జనసేన చోడవరం నియోజకవర్గం పీవీఎన్ఎస్‌రాజు, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్, ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, బీజేపీ నాయకులు గాదె శ్రీనివాసరావు, నర్సీపట్నం మున్సిపాలిటీ జనసేన పార్టీ నాయకురాలు అద్దేపల్లి సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి తరఫున తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసి 100 శాతం విజయ తీరాలకు చేరుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియతో పాటు, క్షేత్రస్థాయిలో మూడు పార్టీల శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. రానున్న ఎన్నికల్లో కూటమి పూర్తిస్థాయి విజయం సాధించేలా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని ఈ సమావేశంలో స్పష్టం చేశారు.





# ముంపు రైతులకు బాసట

## మునిగిన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గంలోని సరుబుజ్జిలీ మండలంలో వంశధార నది పరివాహక ప్రాంతాల్లో నదిలో నీటిమట్టం అధికంగా పెరగడంతో ముంపునకు గురైన సిందువాడ, యరగం, తెలికి పెంట, లొద్దల కాగితాపల్లి గ్రామాల్లో ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముంపు పరిస్థితులను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ గ్రామాల్లో, రైతులు ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు.

# పెడనలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



పెడన (చైతన్యరథం): పట్టణ అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ, పెడన పురపాలక సంఘం పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పెడన పురపాలక సంఘానికి మంజూరైన హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ నిధులు రూ.12.00 కోట్లు, అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.91.00 లక్షలు నుంచి చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో భాగంగా, ఈరోజు రూ.20 లక్షల విలువైన పనులకు, రూ.30 లక్షల విలువైన 15వ ఆర్థిక సంఘం పనులకు పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. పెడన పట్టణంలోని 2,4,13,14,15,17వ వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా వివిధ అభివృద్ధి పనులు బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణం తదితర పనులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో రహదారుల అభివృద్ధి, రాకపోకలకు సౌకర్యం మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు. పెడన పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ, పట్టణ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వార్డు ఇన్‌చార్జిలు, ప్రజలు పాల్గొన్నారు.



# ఇళ్ల పట్టాలు మంజూరైన కొండప్రాంతవాసుల్లో ఆనందం

## మమేకమైన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ధా వెంకన్న

విజయవాడ (చైతన్యరథం): 46వ డివిజన్ మసీద్ స్ట్రీట్, అల్లీ నగర్ కొండ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరైన లబ్ధిదారులను పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్ధా వెంకన్న నేరుగా కొండ ప్రాంతానికి వెళ్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టాలు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కొండ ప్రాంతంలో నివసిస్తూ ఎదుర్కొంటున్న సమస్యలకు ఇళ్ల పట్టాల మంజూరుతో పరిష్కారం లభించినట్లయిందని తెలిపారు. తమ సొంత ఇంటి స్థలానికి హక్కు కల్పించడం పట్ల కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు కొండ ప్రాంతం వరకు వెళ్లిన బుద్ధా వెంకన్న స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టాలు మంజూరైన కుటుంబాలను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి స్థలం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో భరోసా నింపుతున్నాయని బుద్ధా వెంకన్న అన్నారు. ఎన్నో ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్న కొండ ప్రాంత ప్రజల కల నెరవేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. "ప్రజల సంతోషమే ప్రభుత్వానికి ప్రాధాన్యత. ప్రజలకు మేలు జరిగే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను" అని బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రంకొండ, పోతినిడి లోకేష్, ధనల శ్రీనివాసరావు, బేవర జోగేశ్వరరావు, వడ్డాది రమణ, అమరా మురళి, సాదిక్, హర్షద్ పాల్గొన్నారు.

చైతన్యరథం

# ఇంద్రకీలాద్రి వైభవానికి ప్రతీకగా దసరా ఉత్సవాలు



**ఎంపీ కేశినేని చిన్ని, విజయవాడ ఉత్సవ్, సరస్సు మేళాకు ఘనంగా ఏర్పాట్లు, 18 ఎకరాల పున్నమి ఘాట్‌లో సాంస్కృతిక సంబరాలు, రెండు రోజుల పాటు ఉత్సవాలను ఆస్వాదించేలా ప్రణాళికలు**

విజయవాడ (చైతన్యరథం): దసరా దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడలో భక్తులు, పర్యాటకులు, కళాభిమానులను ఆకట్టుకునేలా విజయవాడ ఉత్సవ్, జాతీయ సరస్సు మేళను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ పార్లమెంట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. విజయవాడలో మీడియాతో ఎంపీ చిన్ని మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు విజయవాడకు తరలివస్తారని, దుర్గమ్మ ఆశీస్సులతో విజయవాడ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గత ఏడాది విజయవాడ ఉత్సవ్‌ను వైభవంగా నిర్వహించామని, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా లక్షలాది మంది ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ప్రజల సహకారంతో గత ఏడాది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది దేవీ నవరాత్రుల సందర్భంగా అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఎంపీ చిన్ని వెల్లడించారు. అదే సమయంలో అక్టోబర్ 8 నుంచి 23 వరకు జాతీయ సరస్సు మేళ కొనసాగుతుందని తెలిపారు. విజయవాడలోని 18 ఎకరాల పున్నమి ఘాట్ పరిధిలో సరస్సు మేళ, విజయవాడ ఉత్సవ్‌లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మాకినేని బసవపున్నయ్య స్టేడియంలోనూ పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడను సాంస్కృతిక, కళల రాజధానిగా మరోసారి చాటి చెప్పేలా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నామని ఎంపీ చిన్ని తెలిపారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులను ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని, ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సరస్సు మేళ, విజయవాడ ఉత్సవ్, అమ్మవారి దర్శనం.. ఈ మూడు కార్యక్రమాలను ఒకే పర్యటనలో ఆస్వాదించేలా అతిథులు, సందర్శకుల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని, సాయంత్రం విజయవాడ ఉత్సవ్, సరస్సు మేళలో పాల్గొనేలా ప్రజలు తమ రెండు రోజుల షెడ్యూల్‌ను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని ఎంపీ చిన్ని విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఉత్సవ్‌లో పది రోజుల పాటు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రుచికరమైన వివిధ ప్రాంతాల వంటకాలతో ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మైసూరు ఏనుగులను విజయవాడకు తీసుకువచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఉత్సవాల నిర్వహణను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారని ఎంపీ చిన్ని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు. భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, భద్రత, పారిశుధ్యం, తాగునీరు తదితర అన్ని అంశాల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రేపు అంబేద్కర్ కళా వేదికలో విజయవాడ ఉత్సవ్ కర్టన్ రైజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీ చిన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల్లో నిర్వహించబోయే వివిధ కార్యక్రమాలను మంత్రులు, అధికారులు వివరించనున్నారని చెప్పారు. ఉత్సవాల పూర్తి వివరాలను డ్రాఫ్ట్ రూపంలో మీడియాకు అందిస్తామని తెలిపారు. విజయవాడ ఉత్సవ్‌ను కేవలం ప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా దాతలు, సంస్థలు, వివిధ వర్గాల సహకారంతో నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీ చిన్ని తెలిపారు. భవిష్యత్‌లో స్వయం సమృద్ధి (సెల్ఫ్-సస్టైనింగ్) మోడల్‌లో విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రజలు, మీడియా నుంచి వచ్చే విలువైన సలహాలు, సూచనలను స్వీకరించి ఉత్సవాలను మరింత మెరుగ్గా నిర్వహిస్తామని ఎంపీ చిన్ని తెలిపారు. విజయవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులు ఆధ్యాత్మికతతో పాటు కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార వైవిధ్యాన్ని ఆస్వాదించేలా ఈ ఉత్సవాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. దసరా సందర్భంగా విజయవాడకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మికమైన, సాంస్కృతిక అనుభూతిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు.

## ఎన్‌ఎస్పీ కాలువలో మురుగు, చెత్త తొలగింపు



**చీఫ్ విప్ జీవీఆదేశాలతో అధికారులు తక్షణ చర్యలు**

వినుకొండ పట్టణంలోని ఎన్‌ఎస్పీ కాలువ వద్ద నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తక్షణమే స్పందించారు. ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, మురుగును వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. దుర్వాసన రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. చీఫ్ విప్ ఆదేశాలతో అధికారులు వేగంగా చర్యలు చేపట్టి వ్యర్థాలను తొలగించడంతో, ఎన్‌ఎస్పీ కాలువ పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. ప్రజా సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన చీఫ్ విప్ జీవీకి స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛత వైపు ప్రజలు అడుగులు వేయాలి

**హెచ్‌డీఎఫ్‌సీ స్వచ్ఛథాన్ ప్రోమో రన్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర' ఛైర్మన్ పట్టాభిరామ్ పిలుపు**
**వచ్చేనెల 2న విజయవాడలో ఆకర్షణీయంగా 'స్వచ్ఛథాన్-2026'నిర్వహణ**



విజయవాడ (చైతన్యరథం): స్వచ్ఛత వైపు ప్రజలు అడుగులు వేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న 'స్వచ్ఛథాన్-2026'ను మరింత ఆకర్షణీయంగా నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. విజయవాడ ఉత్సవ్‌కు ప్రారంభ వేడుకగా నిలువనున్న స్వచ్ఛథాన్ రాష్ట్రంలో స్వచ్ఛత, పచ్చదనంపై ప్రభావవంతమైన సందేశాన్ని ఇవ్వనుందన్నారు. విజయవాడ బందరు రోడ్డులో ఆదివారం ఉదయం 6 గంటలకు జరిగిన హెచ్‌డీఎఫ్‌సీ స్వచ్ఛథాన్-2026 ప్రోమో రన్ లో పాల్గొన్న అమరావతి రన్నర్స్, విజయవాడ రన్నర్స్ ను ఉద్దేశించి పట్టాభిరామ్ మాట్లాడారు. రాష్ట్ర రాజధాని అమరావతికి స్వాగత ద్వారం లాంటి విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం, ఆర్టీసీ బస్టాండు, కనకదుర్గ గుడి, ప్రకాశం బ్యారేజ్, అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్ , కృష్ణా నది కరకట్ట వంటి వివిధ ఐకానిక్ స్పాట్స్ ను కలుపుతూ స్వచ్ఛథాన్ రెండవ సంచిక రూట్ ను రూపొందించారు. పరుగులో పాల్గొనబోతున్న వారికి ఒక కొత్త అనుభవాన్నిఅందించనున్నట్లు చెప్పారు. స్వచ్ఛత ఇతివృత్తంతో దేశంలో నిర్వహిస్తున్న ఏకైక మారథాన్‌గా నిలుస్తున్న స్వచ్ఛథాన్-2026 లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ మెడల్‌తోపాటు ఒక మొక్కను కూడా బహుమతిగా ఇచ్చి స్వచ్ఛ ఆంధ్రతో పాటు హరితాంధ్ర ప్రదేశ్ సందేశాన్ని కూడా ఇస్తున్నట్లు పట్టాభి రామ్ చెప్పారు. స్వచ్ఛత విషయంలో దేశంలో మన రాష్ట్రం ఆదర్శప్రాయంగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని చెప్పారు. వారి ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఇంకా పెద్దఎత్తున నిర్వహిస్తున్నారని, అంతర్జాతీయ స్థాయి రన్నర్స్ కూడా పాల్గొంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. గేట్‌వే ఆఫ్ అమరావతికి ఈ స్వచ్ఛథాన్ తలమానికంగా ఉంటుందన్నారు. అంతకు ముందు, బందరు రోడ్డులో నిర్వహించిన "హెచ్.డి.ఎఫ్.సీ స్వచ్ఛథాన్-2026" ప్రోమో రన్ లో పెద్ద సంఖ్యలో అమరావతి రన్నర్స్ తో పాటు పట్టాభిరామ్ కూడా పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ కోసం స్వచ్ఛ ఆంధ్ర అంటూ స్వచ్ఛత, పచ్చదనం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి అంశాలపై నినాదాలిస్తూ రన్నర్స్ చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్వచ్ఛథాన్-2026 స్పాన్సరర్ హెచ్.డి.ఎఫ్.సీ. బ్యాంకు ఏరియా హెడ్ వినీత్ రాంపే , నైట్రో పికెల్ బాల్ క్లబ్ ఫౌండర్ క్రాంతి గద్దే, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేష్ చంద్ర, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాస్ దండమూడి, అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి, ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ రామ కృష్ణ, విజయవాడ రన్నర్స్ నిర్వాహకులు తడవర్తి దీపక్, బాబీ నాగ్ తదితరులు పాల్గొన్నారు. హెచ్.డి.ఎఫ్.సీ. స్వచ్ఛథాన్-2026 రన్ లో హాఫ్ మారథాన్, టెన్ కే , ఫైవ్ కే విభాగాలలో ఆసక్తి గల అభ్యర్థులు 'ఐఫినిష్' యాప్ ద్వారా తమ వివరాలను సెప్టెంబర్ 30వ తేదీ లోపు నమోదు చేసుకోవచ్చని అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి తెలిపారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాలనుంచి ఎనిమిది వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన వివరించారు.



# సీఎం, డీసీఎం పాల్గొనే పల్లెపండుగ విజయవంతం కావాలి

## కూటమి శ్రేణులకు మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు, ఎంపీలు పిలుపు



పామూరు, (చైతన్యరథం): ఈ నెల 29న ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పాల్గొనే పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా విజయవంతం చేసేందుకు పామూరు పట్టణం లోని పువ్వడి కన్వెన్షన్ నందు సన్నాహక సమావేశం సభా ప్రాంగణాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ప్రోగ్రాం ఇంచార్జి రాజు, జోన్ కోఆర్డినేటర్ గోపాలపురం శాసన సభ్యులు మద్దిపాటి వెంకట రాజు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి, ఉదయగిరి శాసన సభ్యుడు కాకర్ల సురేష్, పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివ, రాష్ట్ర మారిటైమ్ చైర్మన్ దామచర్ల సత్య, అబ్జర్వర్లు, కూటమి నాయకులు కలిసి ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు, వివిధ శాఖల విభాగాధిపతులతో కలిసి కార్యక్రమ నిర్వహణకు సంబంధించి అవసరమైన సూచనలు చేశారు. లక్షకు పైగా ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, భద్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనను ఘనంగా నిర్వహించి పల్లె పండుగ 3.కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే మనందరి లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఉద్యాన రైతులకు చేయూత

## అధికారులకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచన

మార్కాపురం (చైతన్యరథం): శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లోని స్వగృహంలో అగ్రికల్చర్ హార్టికల్చర్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ హబ్ ద్వారా ఈ ప్రాంత రైతులకు చేకూర్చే ప్రయోజనాలు, ఉద్యాన వన పంటలకు గిట్టుబాటు ధరలు, ఉద్యానవన పంటలకు మార్కెటింగ్ సదుపాయం, పంట ఉత్పత్తులను నిలవ చేయడానికి శీతల గిడ్డంగులు రైతులకు ఉపయోగపడే ఇతర పథకాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. వీటిని రైతులకు తెలిసిన విధంగా ప్రచారం చేయాలని శాసనసభ్యుడు హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అగ్రికల్చర్ హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎన్టీఆర్, కోడెల విగ్రహాల ఆవిష్కరణ





సత్తెనపల్లి (చైతన్యరథం): నకరికల్లు మండలం చాగల్లు గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు, లావు శ్రీకృష్ణ దేవరాయలు చేతుల మీదుగా రెండు విగ్రహావిష్కరణలు ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహం, మాజీ శాసనసభ స్పీకర్, స్వర్గీయ కోడెల శివప్రసాదరావు విగ్రహం, అనంతరం చాగల్లు గ్రామంలో కోటి తొమ్మిది లక్షల రూపాయల పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారకరామారావు, తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, కోడెల శివప్రసాద్ సత్తెనపల్లి అభివృద్ధి ప్రదాత. వారి ఆశయాలను కొనసాగించడమే మన లక్ష్యం అన్నారు. చాగల్లు గ్రామాన్ని కోట్ల రూపాయల నిధులతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# సీఎం చంద్రబాబు పాల్గొనే పల్లె పండుగను విజయవంతం చేయాలి

## పార్టీ శ్రేణులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపు

కందుకూరు (చైతన్యరథం): ఈ నెల 29న నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి దేవినేని ఉమా పాల్గొన్నారు. రామాపురంలో జరిగే పల్లె పండుగ 3.0 ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితర కూటమి నేతలు హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, భవనాల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి పనులు చేపట్టిందని దేవినేని ఉమా తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమాల ద్వారా కందుకూరు నియోజకవర్గానికి రూ.100 కోట్ల నిధులు వచ్చినట్లు పేర్కొన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితో వెలుగొండ ప్రాజెక్టు పూర్తయిందని, రెండో దశలో కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు కూడా సాగునీరు అందడంతో ప్రాంతం సస్యశ్యామలం కానుందని అన్నారు. ఉలవపాడు మామిడి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, మామిడిని కాపాడుకునేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సాగు, తాగునీటి రంగంలో చేపట్టిన ప్రాజెక్టుల వల్ల రాయలసీమకు నీరు అందుతోందని దేవినేని ఉమా పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను డెల్టాకు తీసుకువచ్చి, కృష్ణా జలాలను రాయలసీమకు మళ్లించిన ఫలితంగా రాయలసీమలో సాగునీటి విస్తీర్ణం పెరిగిందన్నారు. "పట్టిసీమ దండగ.. పంపులు పీకుతాం.. అది ఒట్టిసీమ" అని గతంలో విమర్శించిన జగన్‌రెడ్డి, ప్రస్తుతం పట్టిసీమ ద్వారా అందుతున్న నీటి ప్రయోజనాలపై సమాధానం చెప్పాలని దేవినేని ఉమా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేసి 100 శాతం ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విభేదాలకు తావులేకుండా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని దేవినేని ఉమా సూచించారు



# నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి

## మంత్రి సవిత, 85 మంది లబ్ధిదారులకు రూ.95 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

పెనుకొండ (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.95 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి సవిత పెనుకొండ క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వైద్య చికిత్సలు, ఇతర అత్యవసర అవసరాల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు పెనుకొండ నియోజకవర్గంలో 1,391 మంది లబ్ధిదారులకు రూ.15.09 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని మంత్రి సవిత తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట

## కుట్టు మిషన్లు అందజేసిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధనరెడ్డి తదితరులు



ఒంగోలు (చైతన్యరథం): కనిగిరిలో జనని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ పొందిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యే ముత్తుమూల అశోక్‌తో కలిసి మహిళకు రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ �ు జోనల్ కో-ఆర్డినేటర్ దామచర్ల సత్య కుట్టు మిషన్లు అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తూ, వారు స్వశక్తితో ఎదిగి కుటుంబాలకు అండగా నిలిచేలా అనేక అవకాశాలను కల్పిచడం జరుగుతుందని ఆయన అన్నారు. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాన్ని ఉపాధిగా మలుచుకుని ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టు మిషన్లు అందించడం అభినందనీయమన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయన్న ముఖ్యమంత్రి సంకల్పానికి అనుగుణంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న జనని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

# టీడీపీ హయాంలోనే బీసీల అభివృద్ధి

## రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం (చైతన్యరథం): బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. రాజమహేంద్రవరంలోని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం బీసీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సగభాగంగా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, వారిని చట్టసభల్లోకి తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు గారిదేనని సత్తిబాబు అన్నారు. బీసీలను గుర్తించి, వారి రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేసిన నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల స్థాయి నుంచే నాయకత్వ అవకాశాలు కల్పించేందుకు స్థానిక సంస్థల ఎన్నికల 24 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆయన వేసిన అడుగులు చారిత్రాత్మకమన్నారు. అనంతరం నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని సత్తిబాబు గుర్తుచేశారు. అయితే వైసీపీ పాలనలో 30 ఏళ్లుగా కొనసాగుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని, దాని ఫలితంగా సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ పదవులు కోల్పోయారని తీవ్ర అగ్రహారం వ్యక్తం చేశారు. "బీసీలపై ప్రేమ ఉందని చెప్పుకునే జగన్ ప్రభుత్వం.. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఎందుకు తగ్గించింది? బీసీలకు దక్కాల్సిన రాజకీయ అవకాశాలను ఎందుకు దూరం చేసింది?" అని సత్తిబాబు ప్రశ్నించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు, బీసీలకు నిజమైన రాజకీయ సాధికారత కల్పించే రాజకీయాలకు ఉన్న తేడాను ప్రజలు గమనించారని అన్నారు.

### బీసీలపై జగన్‌ది కపట ప్రేమ

వైసీపీ పాలనలో బీసీలపై ప్రేమ పేరుతో మాటలు చెప్పడం తప్ప, వారి రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోలేదన్నారు. బీసీ నాయకత్వాన్ని బలపరిచే విధానాలకు బదులుగా, బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. "బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే 34 శాతం రిజర్వేషన్లను ఎందుకు తగ్గించారు? 16,800 మంది బీసీలు రాజకీయ పదవులు కోల్పోయే పరిస్థితి ఎందుకు వచ్చింది?" అని బీసీ సమాజానికి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ అధికారం కల్పించడంలో ఎన్టీఆర్ వేసిన పునాదులను చంద్రబాబు నాయుడు మరింత ముందుకు తీసుకెళ్లారని సత్తిబాబు అన్నారు. బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడమే కాకుండా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ద్వారా గ్రామస్థాయి నుంచే బీసీ నాయకత్వాన్ని పెంచేందుకు టీడీపీ కృషి చేసిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు తిరిగి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో రాజకీయ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33? శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన నిర్ణయాలను కూటమి ప్రభుత్వం తీసుకున్నట్లు తెలిపారు.




# కూటమితో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు

## రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): సమాజంలో సగభాగంగా ఉన్న బీసీల రాజకీయ, సామాజిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుంటోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి నాలుగు దశాబ్దాల చరిత్ర ఉందని ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. నందమూరి తారక రామారావు హయాంలోనే బీసీలను ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా రాజకీయంగా ప్రోత్సహించారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన రిజర్వేషన్ల ద్వారా గ్రామస్థాయి నుంచే బీసీ నాయకత్వాన్ని పెంచే విధానానికి ఎన్టీఆర్ పునాది వేశారని తెలిపారు. చంద్రబాబు నాయుడు హయాంలో 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచినట్లు పేర్కొన్నారు. అయితే గతంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల 16,800 మంది రాజకీయ పదవులు కోల్పోయారని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రెండేళ్లలో వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా బీసీల కోసం రూ.32,534 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని తెలిపారు. నేతన్న సేవలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సహాయం, హ్యాండ్లూమ్ మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, వేట విరామ సమయంలో 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందించడంతో పాటు మత్స్యకారుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడామని తెలిపారు. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు అందించే భృతిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచినట్లు వివరించారు. మత్స్యకార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బీసీల జనాభా 2.66 కోట్లు, మొత్తం జనాభాలో 50.42 శాతంగా ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బీసీల జనాభా 48.84 శాతం, పట్టణ ప్రాంతాల్లో 54.36 శాతంగా ఉందన్నారు. 138 బీసీ ఉపకులాలకు న్యాయం చేసేలా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందని అన్నారు. ఎన్నికల్లోనే కాకుండా గ్రామస్థాయి నుంచి నాయకత్వాన్ని అభివృద్ధి చేసే దిశగా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని తెలిపారు. కాగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాజకీయంగా, సామాజికంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు.



## ఏఐ ఏజెంట్లకు శిక్షణ నిలిపివేత

ఏఐ ఏజెంట్లు కట్టుతప్పి ప్రవర్తిస్తుండడంతో ఓపెన్ ఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ మోడళ్ల శిక్షణను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించింది. అవి తాము అప్పగించిన పనులకు మించి ముందుకు వెళుతుండడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఇటువంటి హ్యాకింగ్‌లను ఎదుర్కొనేలా అదనపు భద్రతా చర్యలు అందుబాటులో ఉన్నాయని తమకు పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే శిక్షణను తిరిగి ప్రారంభిస్తామంది. ఏఐ అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. ఇతర సమస్యలు తలెత్తుతుండడంతో పలుమార్లు తమ మోడళ్ల ట్రైనింగ్‌ను నిలిపివేయాల్సి వస్తోందని పేర్కొంది. మూడు నెలల్లో ఓపెన్ ఏఐ తన మోడళ్ల అభివృద్ధిని నిలిపివేయడం ఇది రెండోసారి. జూలైలో ఏఐ స్టార్టప్ 'హగ్గింగ్ ఫేస్'ను లక్ష్యంగా చేసుకున్నట్లు గుర్తించడంతో కొద్దిరోజుల పాటు ట్రైనింగ్‌ను నిలిపివేసింది. దీంతో ఏజెంట్లు సొంతంగా ప్రవర్తించడం, వెబ్‌సైట్లను హ్యాక్ చేయడం, గోప్య సమాచారాన్ని బహిర్గతం చేయడం వంటి వాటిని నిరోధించేందుకు రక్షణ చర్యలు చేపట్టాలని అమెరికా చట్టసభ సభ్యులు ఏఐ ల్యాబ్‌లపై ఒత్తిడి పెంచుతున్నారు. ఓపెన్ ఏఐ ప్రత్యర్థి ఆంత్రోపిక్ అధిపతులు కూడా ఏఐ అభివృద్ధికి కళ్లెం వేయాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మరోసారి శిక్షణను నిలిపివేసింది. అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి తమ ఏఐ ఏజెంట్లు చొరబడినప్పటికీ వాటికి సంబంధించిన విలువైన సమాచారాన్ని, ప్రజలకు అందుబాటులో లేని సమాచారాన్ని అవి సేకరించలేదని ఓపెన్ ఏఐ స్పష్టం చేసింది. ప్రజలకు అందుబాటులో ఉండే సమాచారాన్నే యాక్సెస్ చేసినట్లు తెలిపింది. భద్రతా ఉల్లంఘనలకు సంబంధించిన చర్యలను తాము నిరంతరం పరిశీలిస్తున్నామని పేర్కొంది.




## బ్లూ కాలర్ కార్మికుల సమస్యలపై చర్చ

### భారతీయ కమ్యూనిటీ సభ్యులతో విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీప్రియ రంగనాథన్ భేటీ

**దుబాయ్:** దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీప్రియ రంగనాథన్ భారతీయ సమాజ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూఏఈలో బ్లూ కాలర్ కార్మికులు, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సంక్షేమ అంశాలపై చర్చించారు. భారతీయ కమ్యూనిటీ సభ్యులు తాము ఎదుర్కొంటున్న సవాళ్లను, అనుభవాలను విదేశాంగ అధికారులకు వివరించి కార్మికుల శ్రేయస్సు కోసం పలు కీలక సూచనలు చేశారు. కార్మికులకు తమ హక్కులపై చైతన్యం తేవడం, అందుబాటులో ఉన్న సహాయ సేవలపై అవగాహన కల్పించడం, అత్యవసర సమయాల్లో వేగంగా ఆదుకునేలా సహాయక వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించారు. కార్మికులకు అవసరమైన సమాచారాన్ని, సేవలను మరింత సులభంగా అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. యుఏఈలో కార్మికుల రక్షణ, సంక్షేమాన్ని పటిష్టం చేయడానికి ఇటువంటి సంప్రదింపులు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు పేర్కొన్నారు.




## కువైట్‌లో ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

**కువైట్:** కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం ప్రాచీన సంప్రదాయ విశిష్టతను, మానసిక-శారీరక ఆరోగ్య పరిరక్షణలో దాని సమగ్ర ప్రాధాన్యతను ప్రముఖులు వివరించారు. భారత రాయబారి పరమితా త్రిపాఠి మాట్లాడుతూ... ప్రకృతితో ముడిపడిన సమతుల్య జీవన విధానం, సంపూర్ణ ఆరోగ్య సాధనలో ఆయుర్వేదం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పలువురు నిపుణులు మాట్లాడుతూ... ఆధునిక కాలంలో వచ్చే వివిధ రకాల వ్యాధుల నివారణకు, ఆరోగ్యకరమైన దిన చర్యకు ఆయుర్వేద విధానాలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను ప్రోత్సహించేలా సాత్విక ఆహార ప్రదర్శన (స్టాల్స్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### హవాయి విశ్వవిద్యాలయ

## అసోసియేట్ డీన్‌గా దారా సురేంద్ర

**అమెరికా:** హవాయి విశ్వవిద్యాలయం-మానోవాలోని హవాలీ యూనివర్సిటీలో సీటీఏహెచ్ఆర్ విభాగానికి డాక్టర్ సురేంద్ర దారా సెప్టెంబరు 1 నుంచి అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు చేపట్టారు. తన నూతన నాయకత్వ బాధ్యతల్లో భాగంగా హవాయిలోని ఆహార ఉత్పత్తిదారులు, సమాజాలు, కుటుంబాలకు ఆచరణాత్మకమైన, ప్రభావవంతమైన శాస్త్రాధారిత విస్తరణ విద్య, పరిశోధనలను అందించే వ్యూహాలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. కీటక శాస్త్రం, సమగ్ర సస్యరక్షణ నిర్వహణ, సూక్ష్మజీవ ఆధారిత నియంత్రణ రంగాల్లో దశాబ్దాల అనుభవాన్ని ఈ పదవికి తీసుకువస్తున్నారు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వ్యవసాయ వ్యవస్థల్లో పంటల ఆరోగ్యం, జీవ ఉద్దీపకాలు, నీటిపారుదల, పోషక నిర్వహణ వంటి అంశాలపై ఆయన విస్తృతంగా పనిచేశారు. 400కు పైగా శాస్త్రీయ వ్యాసాలు, పుస్తక అధ్యాయాలను రచించి వ్యవసాయ పరిశోధన, విద్య, విస్తరణ సేవలకు విశేషంగా తోడ్పడ్డారు. సమగ్ర సస్యరక్షణ నిర్వహణ, సూక్ష్మజీవ ఆధారిత నియంత్రణ రంగాలకు అందించిన సేవలతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఆయన, పరిశోధన విస్తరణ సేవల్లో సాధించిన విజయాలకు అనేక పురస్కారాలను అందుకున్నారు. ఈ పదవిని చేపట్టడానికి ముందు డాక్టర్ దారా సీటీఏహెచ్ఆర్ మావీ కౌంటీ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తూ ఆ కౌంటీకి సేవలం దించే విస్తరణ కార్యక్రమాలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను పర్యవేక్షించారు. అంతకు ముందు ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన నార్త్ విలామెట్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా కోఆపరేటివ్ ఎక్స్‌టెన్షన్‌లో కీటకశాస్త్ర నిపుణుడిగా సేవలందించారు. ఈ బాధ్యతల్లో ఆయన బహుళ శాఖల పరిశోధన, విస్తరణ కార్యక్రమాలకు నాయ కత్వం వహించడంతో పాటు అధిక విలువ కలిగిన పంటల కోసం సుస్థిర పరిష్కారాలను అభివృద్ధి చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉత్పత్తిదారులు, పరిశ్ర మ ప్రతినిధులు, స్థానిక సమాజాల మధ్య భాగస్వామ్యాలను కూడా బలోపేతం చేశారు. తన నూతన నాయకత్వ బాధ్యతల్లో భాగంగా హవాయిలోని ఆహార ఉత్పత్తిదారులు, సమాజాలు, కుటుంబాలకు ఆచరణాత్మకమైన, ప్రభావవంతమైన శాస్త్రాధారిత విస్తరణ విద్య, పరిశోధనలను అందించే వ్యూహాలకు ఆయన దిశానిర్దేశం చేస్తారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సహజ వనరుల పరిరక్షణ, ద్వీపవాసుల ఆహార భద్రత ఆయన ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయి. ప్రజా విస్తరణ, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా ఆక్రమణ జాతులు, మొక్కలు-నేల ఆరోగ్యం, మారుతున్న వాతావరణ పరిస్థితులకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడంలో విస్తరణ బృందానికి ఆయన మార్గనిర్దేశం చేయనున్నారు.



### భారత్‌లో అమెరికా విజిట్ వీసా ఇంటర్వ్యూలకు

## భారీగా పెరిగిన వెయిటింగ్ టైమ్

అమెరికా వెళ్లే భారతీయులకు నిరాశ కలిగించే వార్త ఇది. దేశంలోని వివిధ నగరాల్లోని యూఎస్ కాన్సులేట్ల వద్ద విజిటర్ వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల కోసం భారీగా నిరీక్షించాల్సి వస్తోంది. టూరిస్టులు, కుటుంబ సభ్యులను కలువాలనుకునే వారు, వ్యాపార ప్రయాణికులకు ఈ జాప్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒక్కో నగరంలో అపాయింట్‌మెంట్ లభ్యతలో తీవ్ర వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.






### ప్రధాన నగరాల్లో వీసా ఇంటర్వ్యూ వెయిటింగ్ టైమ్ వివరాలు

దేశంలోని ప్రధాన కేంద్రాలలో హైదరాబాద్‌లో అత్యధికంగా సుమారు 12 నెలల పాటు వెయిటింగ్ టైమ్ ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముంబైలో దాదాపు 11.5 నెలల పాటు నిరీక్షణ తప్పడం లేదు. న్యూఢిల్లీలో అపాయింట్‌మెంట్ పొందడానికి సుమారు 10 నెలల సమయం పడుతోంది. మిగతా నగరాలతో పోలిస్తే చెన్నై, కోల్‌కతాలలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, వెయిటింగ్ పీరియడ్ మాత్రం గణనీయంగానే ఉంది. చెన్నైలో సుమారు 7.5 నెలలు, కోల్‌కతాలో దాదాపు 6.5 నెలల నిరీక్షణ సమయం ఉంది.

### ప్రయాణికులకు సలహాలు

ఈ సుదీర్ఘ జాప్యం కారణంగా అమెరికా వెళ్లాలనుకునేవారు ప్రయాణానికి కొన్ని నెలల ముందే వీసా ప్రక్రియను ప్రారంభించడం మంచిది. ముఖ్యంగా కుటుంబ సందర్శనలు, వ్యక్తిగత పర్యటనలు ప్లాన్ చేసుకునే వారికి ఈ లాంగ్ వెయిటింగ్ టైమ్ ఇబ్బందికరంగా మారుతోంది. క్యాన్సిలేషన్ల వల్ల లేదా అదనపు అపాయింట్‌మెంట్ల ప్రకటన వల్ల కొన్నిసార్లు త్వరగా స్లాట్లు దొరికే అవకాశం ఉంటుంది కాబట్టి అభ్యర్థులు యూఎస్ వీసా అపాయింట్‌మెంట్ పోర్టల్‌ను క్రమం తప్పకుండా చెక్ చేస్తూ ఉండాలని సూచిస్తున్నారు. భారత్ నుంచి అమెరికా విజిటర్ వీసాలకు డిమాండ్ విపరీతంగా ఉండటమే ఈ జాప్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

## రచ్చబండ చర్చలు, కలగూర గంప పుస్తకాల ఆవిష్కరణ

**అమెరికా:** కాలిఫోర్నియా బే ఏరియా నగరమైన నెవార్క్‌లో "వీక్షణం సాహితీ గవాక్షం" 14వ వార్షికోత్సవంలో ప్రముఖ రచయిత వెంకట్ నాగం రచించిన రచ్చబండ చర్చలు, కలగూర గంప పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. సాహిత్యాభిమానులు, రచయితలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. రచయిత్రి షంషాద్, అబ్దుల్లా స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సభకు తెలుగు సాహిత్యంలో ఘనాపాఠీలుగా కీర్తింపబడుతున్న కౌముది పత్రిక కిరణ్ ప్రభ, నెచ్చెలి పత్రిక ప్రధాన సంపాద కురాలు కె.గీతామాధవి సభాధ్యక్షులుగా విచ్చేశారు. రచ్చబండ చర్చలు, కలగూర గంప పుస్తకాలను కిరణ్ ప్రభ,



కె.గీతామాధవి, రమణ, శారద కాశీవఝుల, షంషాద్, సురేందర్‌రెడ్డి, వెంకట్ నాగం, వాణి నాగం ఆహుతుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ ప్రభ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ప్రజలతో మమేకమయ్యే భాషలో ఆలోచనాత్మక కాలం శీర్షికలో పత్రికలలో రచనలు చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. తర్వాత మిగిలిన వక్తలు ప్రసంగించారు. చివరగా వీక్షణం వార్షిక సంచిక, కె.గీతా మాధవి రచించిన అనగనగా అమెరికా పుస్తకావిష్కరణ జరిగింది.

# ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు

## - మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



ఉగ్రవాదంపై భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ భద్రతకు ముప్పు కలిగించే ఏ చర్యనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆదివారం 'మన్ కీ బాత్ కార్యక్రమంలో.. టెర్రరిజంపై దేశం అవలంభిస్తున్న విధానాన్ని ప్రధాని వివరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే శక్తులపై కఠినంగా వ్యవహరిస్తాం. ఉగ్రదాడులకు భారత్ తగిన సమాధానం ఇస్తోందని మోదీ పేర్కొన్నారు.

సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టి పదేళ్లు అవుతోందని ప్రధాని గుర్తుచేశారు. నాడు ఉగ్రవాదుల లాంచ్‌ప్యాడ్లను ధ్వంసం చేయడమే లక్ష్యంగా 2016లో ఆ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. రాత్రికి రాత్రే ఆపరేషన్ పూర్తి చేసి సైనికులు తిరిగి వచ్చారని చెప్పారు. ఉగ్రవాదానికి సంబంధించిన కీలక కేంద్రాలు, శిక్షణ, ఆయుధాలు, నిధుల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. ఉగ్రవాదంపై పోరులో సాయుధ బలగాల ధైర్యసాహసాలను ప్రధాని ప్రశంసించారు. దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో దేశం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత ఓ పురాతన బావిని శుభ్రం చేస్తున్న వీడియోను మోదీ పంచుకున్నారు. చెత్తచెదారంతో కూడిన బావిని యువకులు శుభ్రం చేస్తున్నట్లు అందులో కనిపిస్తోంది. గతంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని పురాతన బావిని శుభ్రం చేయడాన్ని మోదీ ప్రస్తావించిన విషయం తెలిసిందే.

# దేశంలోనే మొదటి ఎల్ఎన్‌జీ రైలు

## - ప్రారంభించిన కేంద్రమంత్రి అమిత్ షా




ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో రైల్వే వ్యవస్థను సమూలంగా మార్చేశారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్‌లోని సబర్మతి రైల్వేస్టేషన్‌లో దేశంలోనే మొట్టమొదటి ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) రైలును ఆదివారం పచ్చజెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రసంగిస్తూ... కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. మరోవైపు.. గత 12 ఏళ్లలో మోదీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారన్నారు. అర్థరహితంగా మాట్లాడే హస్తం పార్టీని.. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. రైల్వే వ్యవస్థలో అనేక కొత్త సదుపాయాలను కల్పించి, దానిని ఆధునీకరించారు. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారు. హైడ్రోజన్‌లో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా.. ప్రపంచంలో ఆ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన భారత్‌ను నిలిపారు. ముంబయి నుంచి వడోదర వరకు మొట్టమొదటి లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్‌ను నాలుగు ట్రాక్ నెట్వర్క్‌గా మార్చుతున్నామని అమిత్ షా తెలిపారు.

2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగించాయి. 2024-25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి సున్నాకి తగ్గిస్తాం. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగగా.. 2023-24 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగింది. 99.6 శాతం రైల్వే నెట్వర్క్ విద్యుదీకరణ పూర్తయ్యిందని అమిత్ షా వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఈ కొత్త రైలు ఎల్ఎన్‌జీ, డీజిల్ రెండింటిపై నడుస్తుంది. డీజిల్ వినియోగంలో సుమారు 40 శాతాన్ని ఎల్ఎన్‌జీతో భర్తీ చేస్తుంది. డీజిల్ వినియోగం, ఇంధన ఖర్చులు, ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా దీన్ని ప్రవేశపెట్టారు.


# సీజేపీ ఆందోళనకు సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు



భారత ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 2న నిర్వహించబోయే నిరసనకు సామాజిక కార్యకర్త, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించారు. అయితే ఈ కార్యక్రమానికి తాను భౌతికంగా హాజరు కాలేకపోవచ్చని తెలిపారు. దేశ నాయకుల్లో జవాబుదారీతనం పెంచే ఎలాంటి కార్యక్రమానికైనా తన మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటిదని, అటువంటి ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగితే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుందని వాంగ్‌చుక్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో న్యాయం కోసం పోరాడే ప్రతి రాజకీయ పార్టీకి తాను మద్దతుగా ఉంటానని సోనమ్ వాంగ్‌చుక్ చెప్పారు. జీవితాంతం శాంతిమార్గంలో నడుచుకున్న మహాత్మ గాంధీ జన్మదినం- అక్టోబర్ 2న నిర్వహించే నిరసన శాంతియుతంగా ఉంటుందన్నారు. గతంలో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా సీజేపీ నిర్వహించిన నిరసనల్లో వాంగ్‌చుక్ ప్రధాన పాత్ర పోషించారు. ఆయన నిరాహార దీక్ష చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలోని పలు అంశాలపైన ఎన్నికల కమిషన్లర్లే అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ అభ్యంతరాలను కాదని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల సంఘం ముందుకు వెళ్లిందని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తమకు తెలియకుండానే తీసుకున్నారంటూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ఇందుకోసమే అక్టోబర్ 2న నిరసన కార్యక్రమాలు నిర్వహించబోతోంది.

# దేశ భద్రతలో రాజీపడబోం: రాజ్‌నాథ్



జాతీయ భద్రత విషయంలో భారత్ ఎన్నడూ రాజీపడబోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా వారిని అంతం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేస్తే.. దాని ఫలితానికి సిద్ధంగా ఉండాలని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది తప్ప యుద్ధాన్ని గానీ.. మరో దేశ భూభాగాన్ని గానీ కోరుకోదన్నారు. ఎవరిపైనా బెదిరింపులకూ పాల్పడబోదన్నారు. అయితే ఈ మౌనాన్ని బలహీనత అనుకుంటే తగిన రీతిలో బదులిస్తుందని హెచ్చరించారు. జాతీయ మీడియా ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏదైనా సమస్యను పరిష్కరించడానికి మేము మొదట చర్చలను ఎంచుకుంటాము. అయినప్పటికీ దేశ ప్రజలకు హాని కలిగించే చర్యలు, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహిస్తే ఇక చర్చలకు తావుండదు. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్ర చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించిందని అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

# ఓనం లాటరీ జాక్‌పాట్!




కేరళంలో ఓనం పండుగ బంపర్ లాటరీ ఫలితాల్లో టీఎల్ 360615 నంబరు గల టికెట్‌కు మొదటి బహుమతి కింద రూ.30 కోట్ల భారీ జాక్‌పాట్ తగిలింది. ఆ అజ్ఞాతవ్యక్తి ఎవరో ఇంకా తెలియలేదు. ఈ టికెట్‌ను కన్నూర్‌లోని ముత్తు లాటరీ ఏజెన్సీ విక్రయించింది. ఈ ఏజెన్సీ నిర్వాహకుడైన అనీశ్ తాలిపరంబలో ఆ టికెటును విజేతకు విక్రయించారు. గత క్రిస్మస్ - కొత్త సంవత్సరాది బంపర్ లాటరీలోనూ మొదటి బహుమతి అనీశ్ తాలిపరంబలో విక్రయించిన టికెట్‌కే రావడం గమనార్హం. అనీశ్ గత 18 ఏళ్లుగా లాటరీ టికెట్ల వ్యాపారంలో ఉన్నారు. ఓనం లాటరీ రెండో బహుమతి కింద 20 మందికి (ప్రతి సిరీస్ నుంచి ఇద్దరు విజేతలకు) రూ.కోటి చొప్పున ఇస్తారు. ప్రథమ విజేతకు కమీషన్ ఇతర పన్నులన్నీ పోగా రూ.16.47 కోట్లు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. కేరళ రాష్ట్ర లాటరీ చరిత్రలో ముద్రించిన ఓనం బంపర్ లాటరీ టికెట్లు మొత్తం అమ్ముడుపోవడం ఇదే మొదటిసారి. మొత్తం 90 లక్షల ఓనం బంపర్ లాటరీ టికెట్లు ముద్రిస్తే అన్నీ అమ్ముడుపోయాయి. తద్వారా దాదాపు రూ.450 కోట్ల టర్నోవర్ జరిగింది. ఈ టికెట్ల విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.241.20 కోట్లకు పైగా ఆదాయం చేకూరింది.



# యూపీలో వర్ష బీభత్సం

## మూడు రోజుల్లో 56 మంది మృతి

ఉత్తర్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలో భారీ వర్షాలు, తుపాను సంబంధిత ఘటనల్లో రాష్ట్రవ్యాప్తంగా 56 మంది మృతి చెందారు. మరో 46 మంది గాయపడ్డారు. సీతాపూర్ జిల్లాలో అత్యధికంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అనేక జిల్లాలు వరద పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సాధారణం వర్షపాతం 1.8 మి.మీ.తో పోల్చితే.. గత 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో ఏకంగా 45.1 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు ఆదివారం వెల్లడించారు. యూపీలో మొత్తం 75 జిల్లాలు ఉండగా.. 56 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఫరూఖాబాద్ జిల్లాలో సాధారణం కంటే 7,385 శాతం ఎక్కువ వర్షం కురిసింది. కాన్పూర్, వారణాసి, ప్రయాగ్‌రాజ్, గోరఖ్‌పూర్, బరేలీ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వెయ్యికిపైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఘాఘ్రా, రాప్తి నదుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని, దీనివల్ల లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. ఉన్నావ్‌లోని సోనిక్ టోల్ ప్లాజా వద్ద గంగా ఎక్స్‌ప్రెస్ హైవే పై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ.. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ యూపీ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ రహదారి పేరును 'గంగా ఎక్స్‌ప్రెస్ వాటర్‌వే'గా పేరు మార్చాలని ఎద్దేవా చేశారు.

# దక్షిణాఫ్రికాలో దారుణం

**- వేరువేరు ప్రాంతాల్లో కాల్పులు, 27 మంది బలి**



దక్షిణాఫ్రికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం రేపాయి. జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్ సమీపంలోని రెండు టౌన్‌షిప్‌లలో జరిగిన వేర్వేరు కాల్పుల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది గాయపడ్డారు.

జోహన్నెస్‌బర్గ్‌లోని గౌటెంగ్ ప్రావిన్సులో శనివారం రాత్రి ఓ బార్ వద్ద కాల్పులు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. పలువురు అనుమానితులు ఏకే-47 రైఫిళ్లు, పిస్టళ్లతో తొలుత బయటున్న వారిపై కాల్పులు జరిపి.. ఆ తర్వాత లోపలికి ప్రవేశించి కాల్పులు కొనసాగించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో నలుగురు మహిళలు సహా మొత్తం 17 మంది మృతిచెందారు. సుమారు 15 మందికి గాయాలయ్యాయి. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే.. ఈ ఘటనకు సంబంధించిన కారణాలు ఏమిటనేది ఇంకా తెలియరాలేదు.

మరోవైపు.. కేప్‌టౌన్ సమీపంలోని లాండ్‌వేల్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన మరో కాల్పుల ఘటనలో 10 మంది అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనలో సుమారు 11 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులెవరనే వివరాలేమీ తెలియరాలేదు. అయితే.. ఈ రెండు ఘటనలకు సంబంధించిన నిందితుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది.

ఈ ఘటనలకు కొద్ది రోజుల ముందే డర్బన్ సమీపంలో ఇంట్లో జరిగిన పార్టీలో కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ముగ్గురు దుండగులు జరిపిన దాడిలో గర్భిణితో సహా 11 మంది మృతిచెందారు. ఆయా ఘటనల్లో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎవరినీ అరెస్టు చేయకపోవడం గమనార్హం. వరుస ఘటనలతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# పుతిన్‌తో మాట్లాడి యుద్ధం ముగించండి

**- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ట్రంప్ సూచన**

నాలుగేళ్లకుపైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీ.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడి త్వరలో ఓ ఒప్పందానికి వస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో జెలన్‌స్కీతో భేటీ గురించి మీడియా వద్ద ప్రస్తావిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇన్నేళ్లుగా పుతిన్, జెలెన్‌స్కీ సర్దుకుపోతూ వస్తున్నారు. త్వరలోనే వారు ఓ ఒప్పందానికి రావచ్చు. శీతాకాలానికి ముందే ఈ విషయంపై ప్రకటన వెలువడినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎందుకంటే యుద్ధాన్ని ముగించాలని జెలెన్ స్కీ బలంగా కోరుకుంటున్నారని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు తమ దేశంపై రష్యా దురాక్రమణను అంతం చేయడానికి వైట్ హౌస్ సాయం చేస్తోందని తాను విశ్వసిస్తున్నట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఆంక్షలు, వాణిజ్య ఆంక్షల ద్వారా రష్యాకు వచ్చే ఆదాయాన్ని నిలిపివేయాలని.. తద్వారా యుద్ధాన్ని పొడిగించడానికి మాస్కోకు అవసరమైన డబ్బును అందకుండా చేయాలని ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేశారు.

**ఆగని పరస్పర దాడులు..**

యుద్ధం ముగింపు కోసం ఓ వైపు చర్చలు జరుపుతూనే మరోవైపు ఉక్రెయిన్, రష్యా పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. శనివారం రాత్రి



ఉక్రెయిన్ లోని పలు ప్రాంతాలపై రష్యా దాడులు చేయడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ కార్యాలయాలు, నివాస భవనాలు దెబ్బతినడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. కీవ్‌లోని మొబైల్ ఇంటర్నెట్ సేవలు, స్టార్ లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్ల కోసం పనిచేసే ఓ డేటా సెంటర్ సైతం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, పారిశ్రామిక ప్రాంతాలే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేపట్టింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. ఈ డ్రోన్ దాడుల్లో ముగ్గురు మరణించగా.. పలువురు గాయపడ్డారు.

# నేపాల్లో విరిగిపడ్డ మంచుచరియలు

**10 మంది గల్లంతు**



నేపాల్‌లోని హిమ్‌లుంగ్ హిమాల్ పర్వతం బేస్‌క్యాంప్‌పై ఆదివారం ఉదయం భారీగా మంచుచరియలు విరిగిపడటంతో 10 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో తన బృందానికి చెందిన ఇద్దరు కిచెన్ సిబ్బంది కూడా ఉన్నారని ప్రముఖ యాత్ర నిర్వాహకుడు మింగ్మా గ్యాల్జే షెర్పా తెలిపారు.

గత వారం వాతావరణ హెచ్చరికలు జారీ కావడంతో పర్వత వాలుపై ఉన్న పర్వతారోహణ, రోప్ ఫిక్సింగ్ బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయాయి. అయితే కొందరు మాత్రం అక్కడే ఉండిపోయినట్లు షెర్పా వెల్లడించారు. పలురోజులుగా ఈ ప్రాంతంలో భారీగా మంచు కురుస్తుండటంతో పర్వతారోహణ కార్యక్రమాలను కూడా తాత్కాలికంగా నిలిపివేసి అధిరోహకులు వెనుదిరిగారు.

ఆదివారం మంచు చరియల్లో గల్లంతైన వారు వేర్వేరు యాత్రా సంస్థలకు చెందినవారిగా అధికారులు చెబుతున్నారు. 7,126 మీటర్ల ఎత్తైన హిమ్‌లుంగ్ హిమాల్ పర్వతం టిబెట్ సరిహద్దుకు సమీపంలోని మనాంగ్ జిల్లాలో ఉంది. ఈ పర్వతం ఎత్తైన ప్రాంతాల్లో ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం మరింత క్లిష్టంగా మారింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణం ప్రభావంతో నేపాల్లోని పర్వత ప్రాంతాల్లో భారీగా మంచు.. కొండ ప్రాంతాలు, మైదానాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం నుంచి ప్రతికూల వాతావరణ పరిస్థితులు కొనసాగుతుండటంతో రహదారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని మార్గాల్లో ట్రాఫిక్‌ను అధికారులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ట్రెక్కర్లు, పర్వతారోహకులు తమ కార్యకలాపాలను నిలిపివేయాలని నేపాల్ పర్యాటక శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

## మోదీ వల్లే భారత్‌కు ఇంధన భద్రత



భారత దేశ ప్రజలకు గతంలో ఎన్నడూ లేనంతగా ఇంధన భద్రత సమకూరిందని, నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే అది సాధ్యమైందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు, సహజవాయువు సరఫరాలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న పరిస్థితుల్లోనూ భారత ప్రజల ఇంధన అవసరాలు నిరాటంకంగా తీరుతున్నాయని ఆల్బనీస్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య ప్రతినిధి సభ సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూయార్క్ వచ్చిన అల్బనీస్ 'ఆసియా సొసైటీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మోదీ నాయకత్వ ప్రతిభను ప్రశంసించారు. ఆసియాలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, తదితర దేశాలు చమురు కొరతతో ఇబ్బందిపడుతున్నాయి. భారత్‌లో స్వల్పంగా ధరలు పెరిగినప్పటికీ ఇంధన సరఫరాలు స్థిరంగా కొనసాగుతుండటాన్ని అల్బనీస్ ప్రస్తావించారు. మోదీ ప్రభుత్వ హయాంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య దౌత్యసంబంధాలు బలోపేతమయ్యాయని తెలిపారు. మోదీని ఆస్ట్రేలియాకు అత్యంత సన్నిహితుడిగా అభివర్ణించారు. భారత్ గతంలో 27 దేశాల నుంచే చమురు కొనుగోళ్లు జరిపేది. ప్రస్తుతం 41 దేశాల నుంచి ఇంధన వనరులను దిగుమతి చేసుకుంటున్నట్లు మోదీ ప్రభుత్వం మే నెలలో పార్లమెంటుకు తెలిపింది.

## మొజ్తబాపై రెండు సార్లు అమెరికా దాడి




ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తొలి రోజుల్లోనే ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా కూడా మరణించినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. దాడుల నుంచి ఆయన త్రుటిలో బయటపడినట్లు ఇరాన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటన గురించి ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయిదరీ తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. తమ అగ్రనేతపై దాడి జరిగింది ఒకసారి మాత్రమే కాదని.. రెండు సార్లు అమెరికా ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు.

అలీ ఖమేనీ సహా కీలక నేతలు ఓ భవనంలో సమావేశమైన సమయంలో అమెరికా దాడులు చేసింది. ఈ ఘటనలో అప్పటి సుప్రీం నేత ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మొజ్తబాను వైద్యం కోసం వెంటనే ఓ ఆస్పత్రికి తరలించాం. అనంతరం అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఆ ఆస్పత్రిపై కూడా విరుచుకుపడ్డారు. దీంతో అది పూర్తిగా ధ్వంసమయ్యింది. కొన్ని గంటల పాటు శ్రమించి మా బలగాలు శిథిలాల నుంచి మొజ్తబాను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను మరో సురక్షిత ప్రాంతానికి తరలించి చికిత్స అందించాం. బహిరంగంగా ప్రకటించే వరకు.. ఆయనను తదుపరి సుప్రీంగా ఎన్నుకున్న విషయం కూడా మొజ్తబాకు తెలియదు. తర్వాత దానిని ఆయన అంగీకరించక తప్పలేదని మొహ్సెన్ హెయి దరీ చెప్పారు.

అంతే కాకుండా ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవడానికి నియమించిన కమిటీ నేతలను కూడా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నాయి. వారు తరచూ సమావేశమయ్యే ఖోమ్ సెక్రటేరియట్‌పైనా దాడి చేశాయి. దీంతో కమిటీ నేతల్లో 8మంది ప్రాణాలు కోల్పోయారు. మొజ్తబాను సుప్రీం నేతగా ఎన్నుకోవడానికి రూపొందించిన నివేదికలు, సిఫార్సులు కాలి బూడిదయ్యాయి. అదే సమయంలో ఆయనను సుప్రీంగా ఎన్నుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. అయినప్పటికీ మొజ్తబానే దేశాన్ని ముందుకు నడిపించగలడని భావించి మా నాయకుడిగా ఎన్నుకున్నామని ఖతార్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మొహ్సెన్ హెయిదరీ పేర్కొన్నారు.

# కింగ్ కోహ్లి విరాట్ రూపం!







- **88 బంతుల్లో అజేయంగా 139 పరుగులు**
- **సెంచరీతో అలరించిన కెప్టెన్ గిల్**
- **వెస్టిండీస్‌తో తొలి వన్‌డేలో భారత్ ఘన విజయం**

తిరువనంతపురం వేదికగా వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం సాధించింది. వెస్టిండీస్ విధించిన 296 పరుగుల లక్ష్యాన్ని భారత్ 41.4 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 41.4 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లను కోల్పోయి 300 పరుగులు చేసి విజయం సాధించింది. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి (139 నాటౌట్: 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సులు), కెప్టెన్ శుభ్ మన్ గిల్ (110: 108 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్) సెంచరీలతో అలరించారు. రోహిత్ శర్మ (32), రుతురాజ్ గైక్వాడ్ (13 నాటౌట్) పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్, రోస్టన్ ఛేజ్ చెరో వికెట్ తీశారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే ఈ నెల 30న గౌహతి వేదికగా జరగనుంది. అజేయ సెంచరీతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన విరాట్ కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

అంతకముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగుల భారీ స్కోర్ సాధించింది. విండీస్ ఓపెనర్ జస్టిన్ గ్రీవ్స్(101) సెంచరీతో కదం తొక్కగా.. జాన్ క్యాంప్‌బెల్(62), అమీర్ జాంగో(58) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు పడగొట్టగా, ప్రసిద్ధ కృష్ణ రెండు వికెట్లు తీశాడు.

### కోహ్లి అరుదైన ఘనత

ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. కేవలం 303 ఇన్నింగ్స్‌ల్లోనే 15 వేల పరుగులు పూర్తి చేసి.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ (377 ఇన్నింగ్స్) రికార్డును బ్రేక్ చేశాడు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగే సమయానికి కోహ్లీ ఖాతాలో 14,941 వన్డే పరుగులు ఉన్నాయి. దీంతో 59 పరుగులు చేస్తే 15 వేల మార్క్‌ను చేరుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో కేవలం 46 బంతుల్లోనే ఆ పరుగులు సాధించాడు. వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా కోహ్లీ రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ (452 ఇన్నింగ్స్‌లో 18,426 రన్స్) అగ్రస్థానంలో ఉన్నాడు. ఇన్నింగ్స్ పరంగా చూసుకుంటే సచిన్‌కు 15 వేల పరుగుల సాధనకు 377 ఇన్నింగ్స్ అవసరమవ్వగా, కోహ్లి కేవలం 303 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఇక బంతుల పరంగా సచిన్ 17,528 బంతులు అవసరమవ్వగా.. కోహ్లికి 15,950 బంతులు అవసరమయ్యాయి.

వన్డే క్రికెట్లో అత్యధిక పరుగుల రికార్డులో శ్రీలంక దిగ్గజ బ్యాటర్ కుమార సంగక్కర (14,234 పరుగులు) మూడో స్థానంలో, రికీ పాంటింగ్ (13,704 పరుగులు) నాలుగు, సనత్ జయసూర్య (13,430 పరుగులు) ఐదో స్థానంలో కొనసాగుతున్నారు.

# స్క్వాష్‌లో భారత్‌కు రెండు రజతాలు



ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో రెండు రజత పతకాలు వచ్చి చేరాయి. స్క్వాష్‌లో స్టార్ అథ్లెట్ అనాహత్ సింగ్ మహిళల సింగిల్స్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఫైనల్‌లో ఆమె మలేసియాకు చెందిన శివశంగరి సుబ్రహ్మణ్యం చేతిలో 4-11, 4-11, 7-11 తేడాతో ఓటమి పాలైంది. దీంతో ఆసియా క్రీడల మహిళల సింగిల్స్‌లో రజతం దక్కించుకున్న తొలి భారత మహిళగా ఈ 18 ఏళ్ల యువ అథ్లెట్ అనాహత్ చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు భారత స్క్వాష్ దిగ్గజాలు దీపికా పల్లికల్, జోత్స్న చిన్నప్ప కూడా మహిళల సింగిల్స్‌లో కాంస్య పతకాలతోనే సరిపెట్టుకున్నారు. అయితే 18 ఏళ్ల అనాహత్ వారి రికార్డును అధిగమించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్ కూడా రజతం సాధించాడు. ఫైనల్‌లో మలేసియా ఆటగాడు ఎన్‌గ్ ఈన్ యో చేతిలో 0-3తో ఓడిపోయాడు. 9-11, 5-11, 5-11తో వరుస గేముల్లో పరాజయం చవి చూశాడు. అయితే ఆసియా క్రీడల పురుషుల సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరిన రెండో భారతీయ స్క్వాష్ ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. గతంలో ఈ ఘనతను సౌరభ్ ఘోషల్ సాధించా డు. అంతేకాదు.. ఈ ఆసియా క్రీడలు భారత్ స్క్వాష్ చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచిపోనున్నాయి. ఒకే ఎడిషన్‌లో పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల రెండింటిలోనూ భారత అథ్లెట్లు సిల్వర్ సాధించడం ఇదే తొలిసారి.

# పురుషుల జట్టు గెలుపు



### చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళలకు డ్రా

ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టు జోరు కొనసాగిస్తూ 10వ రౌండ్‌లో విజయం అందుకుంది. అయితే మహిళల జట్టు చైనాతో డ్రా చేసుకుంది. ఓపెన్ విభాగం లో శనివారం నాటి రౌండ్‌లో పురుషులు 3.5-.05తో ఉజ్బెకి స్థాన్-2 జట్టును చిత్తు చేశారు. ప్రపంచ చాంపియన్ గుకేష్, నిహాల్ సరిన్, ప్రజ్ఞానంద ప్రత్యర్థులపై గెలుపొందారు. అర్జున్ ఇరిగేసి తన గేమ్‌ను డ్రాగా ముగించాడు. మహిళల విభాగంలో ఉత్కంఠగా సాగిన పోరులో భారత్, చైనా 2-2తో సమంగా నిలిచాయి. సవితా శ్రీ నెగ్గగా, హంపి, దివ్యా దేశ్‌ముఖ్ ప్రత్యర్థుల తో పాయింట్ పంచుకున్నారు. వంతిక అగర్వాల్ పరాజయం చవిచూసింది. టోర్నీలో మరో రౌండే మిగిలుండగా ఓపెన్‌లో ఉజ్బెకిస్థాన్-1 జట్టు (18 పాయింట్లు) టాప్‌లో కొనసాగుతుం డగా, భారత్ (17) రెండో స్థానంలో నిలిచింది. మహిళల్లో చైనా (18), కజకిస్థాన్ (17), భారత్ (16) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

# అభయ్ సింగ్‌కు రూ.50 లక్షల నజరానా



ఆసియా క్రీడలు-2026లో రజత పతకం సాధించిన తమిళనాడుకు చెందిన స్క్వాష్ అథ్లెట్ అభయ్ సింగ్‌కు ఆ రాష్ట్ర ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. పురుషుల సింగిల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన అభయ్‌ను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ అభినందించారు. అతడి ప్రతిభను గుర్తిస్తూ రూ.50 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. అభయ్‌ను అభినందిస్తూ సీఎం విజయ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'జపాన్‌లో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో పురుషుల సింగిల్స్ స్క్వాష్‌లో రజత పతకం సాధించి తమిళనాడు, భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన అభయ్ సింగ్‌కు నా హృదయపూర్వక అభినందనలు. అతడి అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా తమిళనాడు ప్రభుత్వం రూ.50 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. అభయ్ విజయం తమిళనాడులోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా' అని సీఎం విజయ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

### ఇప్పటికే పలువురికి నజరానా

ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తమిళనాడు క్రీడాకా రులకు సీఎం విజయ్ ఇప్పటికే పలు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారత మహిళల టీ20 జట్టు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించడంలో భాగమైన మదురైకి చెందిన యువ క్రికెటర్ జి. కమలినికి రూ.75 లక్షలు ప్రకటించారు. అదే విధంగా 4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో రజతం సాధించిన తమిళనాడు అథ్లెట్లు విద్య రామ్‌రాజ్, విశాల్‌లకు చెరో రూ.50 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు.

# గాయంతో వైదొలగిన జ్యోతి



తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి మోకాలి నొప్పితో ఆసియా క్రీడల నుంచి వైదొలగింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ హీట్స్‌లో ఆమె బరిలోకి దిగాల్సి ఉంది. అయితే, శనివారం వామప్ సమయంలో మోకాలి నొప్పితో ఇబ్బంది పడడంతో జ్యోతి తప్పుకోవాల్సి వచ్చింది. గత క్రీడల్లో జ్యోతి రజతం నెగ్గింది. ఇక ఆసియాడ్‌లో పురుషుల ట్రిపుల్ జంప్‌లో భారత అథ్లెట్ ప్రవీణ్ చిత్రవేల్ కూడా పోటీల నుంచి విరమించుకున్నా డు. తొలి జంప్‌లోనే ఫౌల్ చేసిన ప్రవీణ్.. ఆ తర్వాత గాయంతో ఈవెంట్ నుంచి వైదొలిగాడు. కాగా, చివరి నిమిషంలో ఫిట్‌నెస్‌పై క్లియరెన్స్ రావడంతోనే జ్యోతి, ప్రవీణ్‌లను ఆసియాడ్‌కు ఎంపిక చేశామనీ, కానీ ఇప్పుడు ఉన్నట్టుండి గాయాలపాలవడంపై నివేదిక కోరతా మని భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది.

# సింగిల్ టేక్ ఆర్టిస్ట్ బిడ్డ వివాదం

## క్లారిటీ ఇచ్చిన శ్రీకాంత్ ఓదెల



న్యాచురల్ స్టార్ నాని, కయాదు లోహార్ జంటగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ది ప్యారడైజ్. ఎన్నో అంచనాల నడుమ సెప్టెంబర్ 24 న రిలీజైన ఈ చిత్రం మొదటి

రోజు మిక్స్ టాక్ అందుకున్నా.. ఆ తరువాత పాజిటివ్ టాక్ ని రాబడుతోంది. ఇక కలక్షన్స్ విషయానికొస్తే.. అంత నెగిటివిటీ తెచ్చుకున్నా కూడా మూడు రోజుల్లో రూ. 136 కోట్లు సాధించి రికార్డులు సృష్టిస్తోంది. ఇంకోపక్క నాని, శ్రీకాంత్ ఓదెల ఈ సినిమాపై హైప్ పెంచడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే గతరాత్రి సక్సెస్ మీట్ నిర్వహించి సెట్‌లో జరిగిన గొడవల గురించి క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా సినిమాలో ప్రశ్నలుగా మిగిలిపోయిన ఎన్నో సీన్స్ పై ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసి సమాధానాలు చెప్పుకొచ్చారు. నాని – శ్రీకాంత్ ఓదెల సినిమా రిలీజ్ తరువాత ఒక వీడియో చేశారు. ఆ వీడియోలో నాని.. సినిమాలో ట్రోలర్స్ ట్రోల్ చేసిన సీన్స్ కి క్లారిఫికేషన్ అడిగాడు. ప్యారడైజ్ రిలీజ్ అయ్యాక ఎక్కువ ట్రోల్ అయ్యింది కయాదు సీన్స్. తండ్రి చనిపోయాక ఆయన చేసిన అప్పును తీర్చడానికి బి గ్రేడ్ సినిమాలు చేస్తుంది. ఆ సినిమాలను తల్లే దగ్గరుండి షూట్ చేస్తుంది. అప్పుడు కూతురు బట్టలు విప్పి నటిస్తుంటే నువ్వు సింగిల్ ఆర్టిస్ట్ వి బిడ్డా అంటుంది. ఆ డైలాగ్ వివాదానికి దారితీసింది. కన్నతల్లి అయ్యి ఉండి.. కూతురిని అనాల్సిన మాటేనా అంటూ నెటిజన్స్ ఫైర్ అయ్యారు. ఎలా ఇంత చెత్త డైలాగ్స్ రాసావు అంటూ డైరెక్టర్ పై మండిపడ్డారు. అయితే ఈ డైలాగ్ రాసుకోవడానికి వెనుక తన ఇంటెన్షన్ వేరు అని శ్రీకాంత్ ఓదెల చెప్పుకొచ్చాడు. కూతురు హీరోయిన్ అవ్వాలని ఇంట్లో నుంచి పారిపోయినప్పుడు.. తల్లి అనుకుంటుంది.. దీనికి యాక్టింగ్ రాదు.. ఎప్పటికైనా ఇది ఇక్కడకు రావాల్సిందే అని.. అలాంటి ఆలోచన ఉన్న తల్లి.. కూతురు యాక్టింగ్ చూసి.. నా కూతురిలో ఇంత మంచి నటన ఉందా.. అవకాశం వచ్చి ఉంటే పెద్ద స్టార్ అయ్యేది అని అనుకోని నువ్వు సింగిల్ టేక్ ఆర్టిస్ట్ బిడ్డ అని చెప్తుంది. నా ఇంటెన్షన్ కరెక్ట్.. కానీ, అది చూపించాలేక పోయాను అని చెప్పుకొచ్చాడు.


## ప్రభాస్ లిస్ట్‌లోకి మరో దర్శకుడు





పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ లైనప్ చూస్తే ఏ హీరోకైనా అసూయ కలగాల్సిందే. ఇప్పటికే వరుస భారీ పాన్ ఇండియా చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్న డార్లింగ్ ఖాతాలో మరో క్రేజీ, ఊహించని ప్రాజెక్ట్ చేరినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. టెక్నికల్ బ్రిలియన్స్, స్టైలిష్ విజువల్స్ అందించడం లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'మిరాయ్', 'ఈగల్' చిత్రాల దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనితో ప్రభాస్ తదుపరి సినిమా ఉండబోతున్నట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. 'ది రాజా సాబ్' రిజల్ట్ అనంతరం మరో సినిమా ఈ బ్యానర్‌కు చేసిపెడతానని ప్రభాస్ మాట ఇచ్చిన సంగతి తెలిసిందే. మరో వైపు కార్తీక్ ఘట్టమనేనికి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ హోమ్ బ్యానర్ వంటిది. ఈ బ్యానర్‌లో ఆయనని లాక్ చేశారు. ఇక ఇప్పటికే కార్తీక్ ఘట్టమనేని చెప్పిన ఒక యూనిక్ కాన్సెప్ట్ లైన్‌కు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ప్రస్తుతం దీనికి సంబంధించిన పూర్తి స్థాయి స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని సమాచారం. సినిమా టోగ్రాఫర్‌గా, దర్శకుడిగా కార్తీక్ ఘట్టమనేని విజువల్ టేకింగ్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను లార్జర్ దేన్ లైఫ్ తరహాలో చూపించే విధానంపై మంచి పేరుంది. అలాంటి టెక్నికల్ దర్శకుడి చేతిలో ప్రభాస్ లాంటి భారీ కటౌట్ పడితే బాక్సాఫీస్ వద్ద విజువల్ వండర్ ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో ఉన్న లైనప్ పరిశీలిస్తే.. హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో మోస్ట్ వైలెంట్ పోలీస్ స్టోరీ 'స్పిరిట్' శరవేగంగా పట్టాలెక్కుతున్నాయి. వీటితో పాటు అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ 'కల్కి 2', ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న మోస్ట్ అవేటెడ్ 'సలార్ 2' కూడా లైన్‌లో ఉన్నాయి. ఇన్ని భారీ ప్రాజెక్టుల నడుమ.. ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని – పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ వార్త బయటకు రావడంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా చర్చ మొదలైంది. ప్రభాస్ మాసివ్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు కార్తీక్ స్టైలిష్ టేకింగ్ తోడైతే వెండితెరపై సరికొత్త అనుభూతి ఖాయం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది.

## 'వారణాసి' ఈవెంట్ టెన్షన్.. ఏడుపొచ్చేసింది



దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న గ్లోబల్ ప్రాజెక్ట్ 'వారణాసి'. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ కోసం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇటీవల జరిగిన ఈ చిత్ర గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో ఎదురైన ఊహించని ఉత్కంఠభరిత అనుభవాన్ని దర్శక నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ తాజాగా సరదాగా గుర్తు చేసుకున్నారు. ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనిలతో కలిసి ఎస్.ఎస్. కార్తికేయ నిర్మించిన తాజా చిత్రం 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్'. శశాంక్ ఏలేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కార్తికేయ.. 'వారణాసి' గ్లింప్స్ విడుదల సమయంలో వేదికపై పడ్డ టెన్షన్‌ను పంచుకు న్నారు. “అందరూ ఎంతో ఆసక్తిగా, పిన్ డ్రాప్ సైలెన్స్‌తో ఎదురుచూస్తున్న ఆ కీలక సమయంలో సడన్‌గా టెక్నికల్ సమస్య తలెత్తి గ్లింప్స్ ప్లే కాకపోవడంతో నాకు గుండె ఆగిపోయినంత పనైంది. క్షణాల్లో ఏడుపు కూడా వచ్చేసింది. 'జెర్సీ' సినిమాలో నాని రైల్వే స్టేషన్‌లో రైలు సౌండ్‌కి మ్యాచ్ చేస్తూ గట్టిగా అరుస్తాడు కదా.. ఆ క్షణంలో వేదిక వెనుక నేను కూడా లోలోపల అలాగే అరిచేశాను. అంత భయం వేసింది” అంటూ ఆనాటి టెన్షన్‌ను నవ్వుతూ చెప్పుకొచ్చారు. ఇక ప్రపంచ స్థాయి అంచనాలతో తెరకెక్కుతోన్న 'వారణాసి' చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. వెండితెరపై సరికొత్త విజువల్ వండర్‌గా రానున్న ఈ చిత్రాన్ని 2027 ఉగాది కానుకగా ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేయనున్నారు. మరోవైపు కార్తికేయ నిర్మాతగా వ్యవహరించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' అక్టోబర్ 2న థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉంది.

## ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కె.ఎస్.రామారావు



హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ఎన్నికలు ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగాయి. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారం భమైన పోలింగ్ మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగింది. ప్రధానంగా కె.ఎస్. రామారావు, ఆదిశేషగిరిరావు ప్యానెళ్ల మధ్య పోటీ నెలకొనడంతో ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు వెల్లడించారు. ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్ష పదవిని కె.ఎస్. రామారావు కైవసం చేసుకున్నారు. సెక్రటరీగా మోహన్ ముళ్లపూడి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా సదాశివరెడ్డి, ట్రెజరర్‌గా శైలజ, జాయింట్ సెక్రటరీగా ఎస్.ఎన్. రెడ్డి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మోహన్ ముళ్లపూడి అత్యధికంగా 1,013 ఓట్లు సాధించడం విశేషం. కమిటీ మెంబర్లుగా ఏడిద రాజా, కృష్ణంరాజు, శ్రీనివాస రాజు, కిషోర్, కాజా సూర్యనారాయణ, మురళీ మోహన్ రావు, భాస్కర్ నాయుడు, బాలరాజు, నాగసుష్మ ఎన్నికయ్యారు. అయితే ఈసారి ఎన్నికల ఫలితాల్లో మరో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్ష పదవిని దక్కించుకున్న కె.ఎస్. రామారావు ప్యానెల్ నుంచి ఆయన ఒక్కరే విజయం సాధించారు.

# ఆ మాత్రం దానికి.. హీరోయిన్ ఎందుకు?

### హీరోయిన్ల పాత్రలపై కంప్లయింట్స్

మంచి కథ, సమర్థుడైన డైరెక్టర్, స్టార్ హీరో.. హిట్ సినిమాకు ఇవి చాలా? చక్కటి హీరోయిన్ అక్కర్లేదా? మరి ఏరి కోరి తెచ్చుకున్న హీరోయిన్‌ని కూరలో కరివేపాకులా పక్కన పెట్టేస్తామంటే ప్రేక్షకులు ఊరుకుంటారా? 'ఆ మాత్రం దానికి ఆమె ఎందుకు?' అంటూ ముఖం మీదే చెప్పేయరూ.. కొన్ని సార్లు సినిమాలు హిట్ కావచ్చుగాక.. మరికొన్నిసార్లు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడొచ్చుగాక.. రీసెంట్ టైమ్స్‌లో నాయికల పాత్రల మీద కంప్లయింట్స్ గట్టిగానే వినిపిస్తున్నాయి.

**బిజినెస్ కోసమేనా?**

కోట్లకు కోట్లు పారితోషికం ఇచ్చి తీసుకొస్తున్న బాలీవుడ్ నాయికలకు మన సినిమాల్లో సరిగ్గా ప్లేస్‌మెంట్ ఇవ్వలేకపోతు న్నారనే అపవాదు ఎప్పటి నుంచో ఉన్నదే. 'కల్కి' సినిమాలో దీపిక పాత్రకు మంచి పేరు వచ్చిన మాట ఎంత వాస్తవమో, దిశా పటానీ రోల్ అంతే చిన్నదన్నది ఒప్పుకొని తీరాల్సిందే.

నిడివి విషయం పక్కన పెడితే, అసలు కొందరు నాయికలకు ప్రాధాన్యం ఉండట్లేదన్నది వారి అభిమానులకు అసంతృప్తి కలిగిస్తున్న అంశం.







'కల్కి'లోనే కాదు, 'కంగువ'లోనూ దిశా పటానికి పెద్దగా పని లేదు. 'లైగర్' తర్వాత అనన్య పాండే సౌత్ వైపు తిరిగి చూడకపోవడానికి కారణం కూడా ఇదేనా? అనే చర్చ కూడా అప్పట్లో జరిగింది. పాన్ ఇండియా స్థాయిలో పేరున్న నాయికలను తీసుకున్నప్పుడు, వారి పేరుతో ఆయా మార్కెట్లలో బిజినెస్ చేస్తున్నప్పుడు వారికి తగ్గ కేరక్టర్లు రాసుకోవడంలో మేకర్స్ అశ్రద్ధ ఎందుకు చేస్తున్నట్టు? అనే ప్రశ్న నెట్టింట్లో కనిపిస్తోంది.

**జాన్వీ కపూర్ పరిస్థితేంటి?**

అతిలోకసుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ తెలుగులోకి వచ్చారన్న ఆనందం ఇప్పటికీ చాలా మందిలో లేదు. ఆమె నటించిన తొలి తెలుగు చిత్రం 'దేవర'. అందులో ఆమె చేసిన తంగం పాత్ర నిడివి చాలా తక్కువ. దాంతో పోలిస్తే 'పెద్ది'లో కాస్త నిడివి పెరిగినప్పటికీ, పాత్రని డిజైన్ చేసిన తీరు అభిమానులను మెప్పించలేకపోయింది. జాన్వీ పరిస్థితే కాదు, కియారా సిట్యువేషన్ కూడా అలాగే ఉంది.

శంకర్ తీసిన 'గేమ్ చేంజర్', యష్ నటించిన 'టాక్సిక్' సౌత్‌లో ఈ భామకు వేరే లెవల్ ఎలివేషన్స్ ఇస్తాయని భావించిన వారిలో నిరుత్సాహం నింపాయి.రొమాంటిక్ సినిమాలు చూడండి

**కథ విన్నప్పుడే..!**

అంతంతమాత్రం కేరక్టర్లుంటే పేరున్న నాయికలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వరన్న ఆలోచన దర్శకుల్లో రావాలి. అది జరగాలంటే ముందు నాయికల్లో మార్పు కనిపించాలి. స్టార్ హీరోతో సినిమా చేసే అవకాశం వచ్చిందనో, పేరున్న సంస్థ నుంచి ఫోన్ చేశారనో, కనీవినీ ఎరుగనంత పారితోషికం అందిస్తున్నారనో.. కథలను, కేరక్టర్లను పట్టించుకోకుండా ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే కెరీర్ కుంటుపడుతుంది. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. అందుకే ఆది నుంచి ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించా లి. అలా చేసినప్పుడు ఇండస్ట్రీలో గౌరవం, అవకాశాలతో పాటు అభిమానుల ఆదరణ కూడా సొంతమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.